# ఈ-కబురు

ఎల్లప్పుడూ విశ్వసనీయ సమాచారం

@ekaburu.com

హైదరాబాద్ (తేదీ) 19-03-2026 (వారం) గురువారం సంపుటి: 02 || సంచిక:76 || పేజీలు–6

www.ekaburu.com


## ఆర్టీసీకి మరో 200 ఎలక్ట్రిక్ బస్సులు




ఈ-కబురు,హైదరాబాద్ పీఎం ఈ-డ్రైవ్ పథకం కింద తెలంగాణ ఆర్టీసీకి కేంద్ర ప్రభుత్వం మరో 200 ఎలక్ట్రిక్ బస్సుల్ని కేటాయించింది. బస్సుల్ని సరఫరా చేసే సంస్థను ఎంపిక చేసేందుకు టెండర్ల ప్రక్రియనూ ప్రారంభించింది. ఈ బస్సుల్ని గ్రేటర్ హైదరాబాద్ నగరంలో ఉపయోగించనున్నారు.

02

## మూసీ మంటలు.. కేటీఆర్ వర్సెస్ శ్రీధర్‌బాబు

ప్రశ్నోత్తరాల సమయంలో కేటీఆర్ వర్సెస్ మంత్రి శ్రీధర్‌బాబు





**ఈ-కబురు,హైదరాబాద్:**

మూసీ ప్రక్షాళన, సుందరీకరణ ప్రాజెక్టు అంశం బుధవారం శాసనసభను కుదిపేసింది. బీఆర్ఎస్ సభ్యుడు కేటీఆర్, మంత్రి శ్రీధర్‌బాబు మధ్య మాటల యుద్ధం కొనసాగింది. ప్రశ్నోత్తరాల సమయంలో బీఆర్ఎస్ సభ్యులు కేటీఆర్, సుదీర్‌రెడ్డి, కాలేరు వెంకటేశ్, బండారి లక్ష్మారెడ్డిలు మూసీ పునరుజ్జీవం అంశంపై ప్రశ్నించారు. దాని డీపీఆర్ సిద్ధమైందా, ప్రాజెక్టు వ్యయం అంచనా ఎంత, నిర్వాసితుల సంఖ్య, వారి పునరావాస చర్యల గురించి ప్రశ్నించారు. దీనికి మంత్రి శ్రీధర్‌బాబు, ప్రాజెక్టు మొదటి దశకు డీపీఆర్ సిద్ధమైందని, మొదటి దశ అంచనా వ్యయం రూ.ఆరున్నర వేల కోట్ల నుంచి రూ.ఏడు వేల కోట్లని, దాదాపు 1,435 నిర్మాణాలు ప్రభావితమయ్యే అవకాశముందని, నిర్వాసిత కుటుంబాలకు టీడీఆర్‌ను జారీ చేస్తామని, 2013 చట్టం ప్రకారం సహాయ పునరావాసాలు ఉంటాయని పేర్కొన్నారు. దీనిపై కేటీఆర్ విరుచుకుపడ్డారు. ఈ ప్రాజెక్టుపై ముఖ్యమంత్రి, మంత్రి, మూసీనది అభివృద్ధి సంస్థ ఎండీ భిన్న ప్రకటనలు చేస్తున్నారని ఆరోపించారు. డీపీఆర్ తయారీకి 18 నెలల సమయం అవసరమవుతుందని రెండు నెలల క్రితం ఇదే సభలో ప్రకటించిన శ్రీధర్‌బాబు, ఇప్పుడు డీపీఆర్ సిద్ధమైందని చెప్పటం వింతగా ఉందన్నారు. ఈ ప్రాజెక్టుకు ఏషియన్ డెవలప్‌మెంట్ బ్యాంక్ రుణం ఇవ్వడానికి సూత్రప్రాయంగా అంగీకరించిందని సభలోనే శ్రీధర్‌బాబు చెప్పారని, కానీ, ఆ బ్యాంకును జనవరి, మార్చి నెలల్లో రెండు పర్యాయాలు సంప్రదిస్తే... తమకు డీపీఆరే అందలేదని, ఎలాంటి లోన్ మంజూరు చేయలేదని వెల్లడించినట్టు పేర్కొన్నారు.

మిగతా 2లో

# మళ్లీ తొక్కుకుంటూ వస్తాం..

## సీఎం రేవంత్‌రెడ్డి

2023 ఎన్నికల్లోనూ బరాబర్ తొక్కుకుంటూ ఇక్కడకు వచ్చాను: సీఎం రేవంత్‌రెడ్డి

2029 ఎన్నికలూ పాసింగ్ క్లౌడ్స్ మాత్రమే...

2034 వరకు ఈ ప్రభుత్వమే ఉంటుంది



- ప్రజాస్వామ్యంలో ప్రజలే రాజులుగా మారి తమ సేవకులను నియమించుకుంటారు... ఇప్పటికైనా అది గ్రహించాలి
- గత ప్రభుత్వ రూ. 8.11 లక్షల కోట్ల అప్పు, 11 శాతం అధిక వడ్డీ భారం వల్లనే మా ప్రభుత్వానికీ పరిస్థితి
- వారసత్వాలతో అధికారం రాదు... చెట్టుపేరు చెప్పి కాయలు అమ్ముకుంటామంటే కుదరదు.
- ప్రజలు ఆగ్రహిస్తే ఈసారి అది కూడా (ప్రతిపక్ష హోదా) ఉండదు..
- కొత్త గవర్నర్‌కు శుభాకాంక్షలు చెప్పేందుకు కేసీఆర్ అసెంబ్లీకి వస్తారని ప్రజలు ఆశించారు
- 2014 నుంచి హిల్ట్ పాలసీతో సహా దేనిపై అయినా విచారణకు సిద్ధం
- అసెంబ్లీలో గవర్నర్ ప్రసంగానికి ధన్యవాద తీర్మానంపై చర్చలో ముఖ్యమంత్రి
- నేను కష్టజీవిని. తెలియకపోతే నేర్చుకుంటాను. ఇతరులకు నేర్పుతాను. ఇదే పంథాలో ముందుకెళ్లి అనుకున్నవి కచ్చితంగా సాధిస్తాను

**రామాయణంలో రావణాసురునికి పట్టిన గతే ప్రతిపక్ష** నేతలకు పడుతుంది. మంచి ఆలోచనతో రాష్ట్ర అభివృద్ధికి, ప్రజల సంక్షేమానికి ఆలోచనలు చేస్తూ పథకాలు అమలు చేస్తుంటే.. రాక్షసుల మాదిరి విఘ్నాలు కలిగించడానికి ప్రయత్నిస్తున్నారు. అలాంటి రాక్షసులకు రామబాణం సమాధానం చెబుతుంది

**మేం ఏం చేసినా కించపరిచేలా, అహంకారంతో** మాట్లాడుతున్నారు. అది తమ జన్మహక్కు అని అనుకుంటున్నారు. ప్రజలు ఆగ్రహిస్తే ఈసారి అది కూడా (ప్రతిపక్ష హోదా) ఉండదు. భూకంపంలో కొట్టుకుపోతారు

**టీడీఆర్, హిల్ట్ పాలసీపై విచారణకు లేఖ రాయండి.** వెంటనే మా ప్రభుత్వం విచారణ చేపడుతుంది. విచారణకు వెనకాడినా లేదా వెనక్కి తగ్గినా క్షమాపణ చెబుతాం

**ఈ-కబురు,హైదరాబాద్:**

2029 అసెంబ్లీ ఎన్నికల్లోనూ మిమ్మల్ని మళ్లీ తొక్కుకుంటూ అధికారంలోకి వస్తామని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి బీఆర్ఎస్ నేతలకు సవాల్ విసిరారు. '2023 ఎన్నికల్లో బరాబర్ మీ నెత్తిపై కాళ్లు పెట్టి తొక్కుకుంటూ ఇక్కడకు వచ్చాను. 2029లో మళ్లీ చూసుకుందాం. మళ్లీ తొక్కకపోతే చూడండి. మీరు ఎట్లా గెలుస్తారో చూస్తాను'అని ఆవేశంగా ప్రకటించారు. బుధవా రం శాసనసభలో గవర్నర్ ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానానికి సమాధానమిస్తూ రెండున్నర గంటలకుపైగా సుదీర్ఘంగా సీఎం ప్రసంగించారు. 'ఇప్పటికైనా మీరు మర్యాదగా ఉండడం నేర్చుకుంటే మంచిది. కనీస మర్యాద దక్కుతుంది'అని హెచ్చరించారు. 2029 ఎన్నికలు కూడా కేవలం పాసింగ్ క్లౌడ్ మాత్రమే. 2034 వరకు ఈ ప్రభుత్వమే ఉంటుంది. అప్పటికే తెలంగాణ ఒక ట్రిలియన్ ఎకానమీగా ఎదుగుతుందని ప్రజలు విశ్వసిస్తున్నారు'అని చెప్పారు. ప్రతిపక్ష సభ్యులు ఆరోపిస్తున్న హిల్ట్-పి, టీడీఆర్‌లకు సంబంధించి వారు లేఖ రాస్తే ఏ విచారణ కోరినా చేయడానికి తమ ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. 'కొందరు తమను తాము రాజులుగా భావిస్తున్నారు. రాచరిక పోకడలతో ప్రజాతీర్పును అవమానిస్తున్నారు. వారసత్వ రాజకీయాలను నమ్ముకుని అధికారం దక్కలేదనే దుఃఖంతో ఆరోపణలు, దుర్‌ప్రచారంతో సభను తప్పుదోవ పట్టించారు. రాజులు పోయినా రాజ్యాలు పోయినా వారి పోకడలు మారలేదు. ప్రజాస్వామ్యంలో ప్రజలే రాజులుగా మారి తమ సేవకులను నియమించుకుంటారన్న విషయాన్ని ఇప్పటికైనా గ్రహిస్తే మంచిది'అని బీఆర్ఎస్ సభ్యులను ఉద్దేశించి రేవంత్‌రెడ్డి వ్యాఖ్యానించారు.

మిగతా 2లో





శ్రీపరాభవ నామ ఉగాది సందర్భంగా మా పాఠకులు, ప్రకటన కర్తలు, ఏజెంట్లు, శ్రేయోభిలాషులకు శుభాకాంక్షలు




2

## సీఎస్ రామకృష్ణారావు పదవీకాలం మరోసారి పొడిగింపు

ఈ-కబురు,హైదరాబాద్ : రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.రామకృష్ణారావు పదవీ కాలాన్ని కేంద్రం మరోసారి పొడిగించింది. ఆయన పదవీకాలాన్ని మూడు నెలల పాటు పొడిగించాలంటూ రాష్ట్ర ప్రభుత్వం చేసిన విజ్ఞప్తి

## విజయ్‌కు సీఎం పదవి.. పార్టీకి 50 శాతం సీట్లు ఆఫర్ చేశారు



**టీవీకే ప్రధాన కార్యదర్శి అధవ్ అర్జున**

ఈకబురు,చెన్నై: రాబోయే ఎన్నికల్లో పోటీ చేసేందుకు తమ అధినేత విజయ్‌కు ముఖ్యమంత్రి పదవితో పాటు ఏకంగా 50 శాతం అసెంబ్లీ సీట్లను ఒక పార్టీ ఆఫర్ చేసిందని తమిళగ వెట్రి కళగం

మిగతా 2లో



## వేగం.. ధర యోగం!

02



## రాజకీయాల్లో ఫుల్‌స్టాప్ ఉండదు

- మీకోసం భవిష్యత్తు ఎదురుచూస్తుంటుంది
- పార్లమెంటు ఓ సార్వత్రిక విశ్వవిద్యాలయం
- రాజ్యసభలో ప్రధాని మోదీ
- పదవీ విరమణ చేయనున్నవారికి వీడ్కోలు

03

## సైబర్ మోసాల్లో పోగొట్టుకున్నా.. చేతికి పాతిక వేలు!

- ఐటల్ మోసాల్లో రూ.50వేల లోపు కోల్పోయిన ఉదంతాల్లో బాధితులకు పరిహారం
- థర్డ్‌పార్టీ ఉల్లంఘనల దృష్ట్యా ఆర్‌బీఐ కార్యాచరణ

02




**ఈ-కబురు,హైదరాబాద్:** సైబర్ నేరాల్లో మన ప్రమేయం లేకుండా సొమ్ము పోగొట్టుకుంటేనే తిరిగి రావడం అనుమానం. మరి మోసగాళ్లు అడిగినప్పుడు ఓటీపీ లాంటి కీలక సమాచారం చెబితే.. ఇక ఆలోచించాల్సిన పనే లేదు. కేసు నమోదై ఒకవేళ నిందితులు దొరికినా డబ్బు రికవరీ చేయడం కష్టమే. ఇలాంటి పరిస్థితుల్లోనూ ఇక నుంచి బాధితులకు పాక్షిక ఉపశమనం కలిగించేందుకు రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా(ఆర్‌బీఐ) సిద్ధమవుతోంది. తక్కువ విలువతో కూడిన డిజిటల్ చెల్లింపు మోసానికి గురైన బాధితులు పాక్షికంగా బాధ్యత వహించినప్పటికీ.. వారికి కొంతమేర పరిహారం చెల్లించడానికి కార్యాచరణ సిద్ధం చేస్తోంది.

**ఐదు రోజుల్లో ఫిర్యాదు చేస్తే..**

సైబర్ మోసాల్లో బాధితుల నిర్లక్ష్యం కొంతమేర ఉన్నా.. థర్డ్‌పార్టీ ఉల్లంఘనల కారణంగా మోసాలు జరిగిన కేసుల్లో పరిహారం చెల్లించేలా ఆర్‌బీఐ విధానాన్ని తాజాగా ప్రతిపాదించింది.



## దివ్యాంగశక్తి పథకంతో దివ్యాంగులకు ఆత్మగౌరవం

- సాయంతో పాటు ఖర్చులూ తగ్గిస్తున్నాం
- దివ్యాంగులకు ఎల్లప్పుడూ సంక్షేమాన్ని ఇచ్చేది మేమే
- దివ్యాంగ శక్తి పథకాన్ని ప్రారంభించిన ముఖ్యమంత్రి చంద్రబాబు
- తన నివాసంలో దివ్యాంగులకు సీఎం ఆత్మీయ విందు

ఈకబురు,అమరావతి, దివ్యాంగుల శక్తిని ప్రపంచానికి చాటేలా ఆత్మ స్థైర్యంతో పని చేసేలా తమ ప్రభుత్వం ప్రోత్సహిస్తుందని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అన్నారు. దివ్యాంగులు సాధికారత సాధించడానికి.. వారి గౌరవాన్ని మరింత పెంచడానికి కూటమి ప్రభుత్వం అన్ని విధాలా సహకరిస్తుందని సీఎం స్పష్టం చేశారు. ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణ సౌకర్యాన్ని దివ్యాంగులకు అందుబాటులోకి తెస్తూ దివ్యాంగ శక్తి పథకాన్ని డిప్యూటీ సీఎం


మిగతా 3లో

# ఇరాన్ అణు కేంద్రంపై దాడి

- అతి పెద్ద గ్యాస్ క్షేత్రంపైనా బాంబులు
- ఆ దేశ నిఘా మంత్రినీ చంపేసిన ఇజ్రాయెల్
- హర్మూజ్ తీరంలో బంకర్ బస్టర్ బాంబులతో దాడి
- అణు కేంద్రం పక్కనే రష్యా అణు విద్యుత్ ప్లాంటు
- దాడిని తీవ్రంగా ఖండించిన రష్యా
- ఇజ్రాయెల్, గల్ఫ్‌పై అత్యాధునిక క్షిపణులను ప్రయోగించిన ఇరాన్
- టెల్ అవీవ్‌లో ఇద్దరి మృతి
- లారిజానీ మృతికి కారకులైన వారికి శిక్ష తప్పదన్న ఖమేనీ

ఈకబురు,దుబాయ్: అమెరికా-ఇజ్రాయెల్, ఇరాన్ యుద్ధం మరింత తీవ్రమైంది. ఏకంగా ఇరాన్‌లోని అణు కేంద్రంపైనే ఇజ్రాయెల్ దాడులు చేసింది. అయితే ఎటువంటి ప్రమాదం చోటుచేసుకోలేదు. ఈ ప్రాంతంలో అణు ధార్మికతపై ఇరాన్, రష్యా ఆందోళన వ్యక్తం చేశాయి. మరోవైపు ఇరాన్ నిఘా మంత్రినీ ఇజ్రాయెల్ చంపేసింది. దీంతో రెండు రోజుల్లోనే ముగ్గురు కీలక నేతలను ఇరాన్ కోల్పోయినట్లయింది. ఇరాన్‌లోని సౌత్ పార్స్ గ్యాస్ క్షేత్రంపై ఇజ్రాయెల్ విరుచుకుపడింది. ఇది ప్రపంచంలోనే అతి పెద్దది. ఈ దాడిని ఖతార్ ఖండించింది. గ్యాస్ క్షేత్రంపై ప్రతిగా గల్ఫ్‌లోని చమురు క్షేత్రాలపై దాడులు చేస్తామని ఇరాన్ హెచ్చరించింది. అలీ లారిజానీ, గులాం రెజా మరణాలకు ప్రతీకారంగా ఇజ్రాయెల్‌తోపాటు గల్ఫ్ దేశాల్లోని అమెరికా స్థావరాలపై ఇరాన్ క్షిపణులతో విరుచుకుపడింది. ఇజ్రాయెల్‌లోని 100కుపైగా లక్ష్యాలపై క్షిపణులను ప్రయోగించింది. తన అత్యాధునిక క్షిపణులను వినియోగించింది. టెల్ అవీవ్‌లో ఇద్దరు మరణించారు.

02



## డీజీపీ సెలక్షన్ ఫైనల్ లిస్టు ప్రభుత్వం వద్దకు!

- సీవీ ఆనంద్, వీపీ ఆప్టే, సౌమ్యామిశ్రా పేర్లు
- కొత్త డీజీపీగా సీవీ ఆనంద్!? ప్రభుత్వ సలహాదారుగా శివధర్‌రెడ్డి?



03

# దివ్యాంగశక్తి పథకంతో దివ్యాంగులకు ఆత్మగౌరవం



పవన్ కళ్యాణ్, మంత్రి నారా లోకేష్ తో కలిసి సీఎం చంద్రబాబు ప్రారంభించారు. ఈ పథకం ద్వారా ఏపీఎస్ ఆర్టీసీలోని సిటీ ఆర్డినరీ, మెట్రో ఎక్స్ ప్రెస్, పల్లె వెలుగు, అల్ట్రా పల్లెవెలుగు, ఎక్స్ ప్రెస్ బస్సుల్లో దివ్యాంగులకు ఉచిత ప్రయాణ సౌకర్యాన్ని కల్పించారు. మొత్తంగా 21 కేటగిరీల బస్సుల్లో 40 శాతం కంటే ఎక్కువ వైకల్యం కలిగిన దివ్యాంగులకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం కల్పిస్తూ పథకాన్ని అమల్లోకి తెచ్చారు. దివ్యాంగుల వెంట వచ్చే సహాయకులతో కలిపి మొత్తంగా 12.76 లక్షల మంది లబ్ధిదారులకు ప్రయోజనం కల్పించేలా ఉచిత బస్సు ప్రయాణం పథకం అమల్లోకి వచ్చింది. ఈ పథకం కోసం ఏటా రూ.207 కోట్ల రూపాయల ప్రజా ప్రభుత్వం ఖర్చు పెట్టనుంది. దివ్యాంగుల శక్తి పథకానికి సంబంధించిన ఈ నిధులను ఆర్టీసీకి ప్రభుత్వం చెల్లించనుంది. పథకం ప్రారంభించిన సందర్భంగా మంగళగిరి బస్టాండ్ నుంచి రాజధానిలోని పెనుమాక వరకు దివ్యాంగులతో కలిసి ముఖ్యమంత్రి చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్, మంత్రి నారా లోకేష్ బస్సులో ప్రయాణించారు. సుమారు 11 కిలో మీటర్ల మేర దివ్యాంగులతో ప్రయాణించిన నేతలు.. వారి కష్టసుఖాలు అడిగి తెలుసుకున్నారు. అలాగే రాష్ట్ర ప్రభుత్వం దివ్యాంగులకు అందిస్తున్న పథకాలను.. కార్యక్రమాలను వివరించారు. ఈ పథకం ప్రారంభిస్తున్న సందర్భంగా ప్రజలు, కూటమి పార్టీల కార్యకర్తలు, లబ్ధిదారులు పెద్ద ఎత్తున తరలి వచ్చారు. రోడ్డుకు ఇరువైపులా ఉన్న ప్రజలకు అభివాదం చేసుకుంటూ సీఎం, డిప్యూటీ సీఎం, మంత్రి నారా లోకేష్ ముందుకు సాగారు. దివ్యాంగులతో కలిసి ప్రయాణం చేసిన అనంతరం తన నివాసంలో దివ్యాంగ శక్తి పథకంలోని పలువురు లబ్దిదారులకు సీఎం ఆత్మీయ విందు ఇచ్చారు. విందుకు వచ్చిన వారిని ముఖ్యమంత్రి అప్యాయంగా పలకరించారు. వారితో కలిసి సీఎం చంద్రబాబు, మంత్రి లోకేష్ భోజనం చేశారు. ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం కల్పించటంపై ముఖ్యమంత్రి చంద్రబాబుకు దివ్యాంగులు ధన్యవాదాలు తెలిపారు. తమ వెంట వచ్చే సహాయకులకు ప్రయాణంలో 50 శాతం రాయితీ కల్పించటంపై హర్షం వ్యక్తం చేశారు.

--దివ్యాంగుల్లో ఆత్మ విశ్వాసం నింపుతాం

ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ..." దివ్యాంగ శక్తి పథకంతో ఈ ఉగాది మరింత వేడుకగా జరుపుకోండి. అందరికీ ఉగాది శుభాకాంక్షలు. 21 నెలల్లో కూటమి ప్రభుత్వం ప్రజల సంక్షేమం కోసం ఎన్నో కార్యక్రమాలు చేపట్టింది. దివ్యాంగ శక్తి పథకం ఎంతో సంతృప్తిని, సంతోషాన్ని కలిగిస్తోంది. నేను, పవన్ కళ్యాణ్, లోకేష్ కలిసి ఈ పథకాన్ని ప్రారంభించి దివ్యాంగులతో కలిసి ప్రయాణించటం సంతృప్తిని ఇచ్చింది. దివ్యాంగులంటే విభిన్న ప్రతిభావంతులు, సమస్యను అధిగమించి విజయాలు సాధించే శక్తి ఉన్న వాళ్లు. గతంలో చేయూత కార్యక్రమం ద్వారా దివ్యాంగులకు సహాయం చేశాం. దివ్యాంగులకు పింఛను కింద రూ.6 వేలు ఇస్తున్న ఏకైక ప్రభుత్వం ఇదే. రూ.500 ఉండే దివ్యాంగుల పెన్షన్ ను రూ.6 వేలకు పెంచి ఇస్తున్నాం. తీవ్ర ఆరోగ్య ఇబ్బందుల్లో ఉండే వారికి రూ.10 వేలు, మంచానికి పరిమితమైన వారికి రూ.15 వేలు ఇస్తున్నాం. ఏటా పింఛన్ల కోసం రూ.33 వేలు ఖర్చు చేస్తున్నాం. ఇప్పుడు బస్సుల్లో దివ్యాంగులకు ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పిస్తున్నాం. ఎలాంటి ఖర్చు లేకుండా దివ్యాంగులు ఇక ఉచితంగా ప్రయాణం చేయవచ్చు. పనులకు, అవసరాలకు ఖర్చు లేకుండా ప్రయాణం చేయవచ్చు. నెలకు రూ.2 వేల దాకా ఆదా అయ్యే అవకాశం ఉంది. మొదటి నుంచి మేమే దివ్యాంగుల సంక్షేమానికి పని చేస్తున్నాం. భవిష్యత్తులోనూ దివ్యాంగులను ఆదుకునేలా మరిన్ని ఆలోచనలు చేస్తాం. ఎంత ఖర్చు చేస్తున్నామో చూడడం లేదు... దివ్యాంగులకు గౌరవాన్ని ఏ మేరకు పెంచుతున్నామనే అంశం పైనే దృష్టిసారించాం. కూటమి అమలు చేసే ఏ పథకం, ఏ కార్యక్రమమైనా నిరుపేదల సంక్షేమం కోసమే. దివ్యాంగులకు అండగా నిలబడాలనే ప్రజా ప్రభుత్వం పని చేస్తోంది. మహిళల కోసం తెచ్చిన స్త్రీ శక్తి పథకం ద్వారా ఇప్పటి వరకూ 52 కోట్ల ప్రయాణాలు జరిగాయి. దివ్యాంగ శక్తితో లక్షల మందికి మేలు జరుగుతుంది. దివ్యాంగ సమస్యలపై ఎప్పుడూ పోరాటాలు చేసే మంద కృష్ణమాదిగ, గోనుగుంట్ల కోటేశ్వరావులను అభినందిస్తున్నాను."అని సీఎం అన్నారు.

--పేదల కోసం పని చేసే ప్రజా ప్రభుత్వమిది

"దివ్యాంగులకు ఇంకా మేలు చేకూరుస్తాం... దానికి కొంచం సమయం పడుతుంది. తెలుగుదేశం ఆవిర్భావం తర్వాత దివ్యాంగుల సంక్షేమం కోసం కార్పొరేషన్‌ను ఎన్టీఆర్ ఏర్పాటు చేశారు. రూ.500గా ఉన్న పింఛను 2014లో టీడీపీ వచ్చాక రూ.1500 చేశాం. 201819 మధ్య రూ.3000కు పెంచాం. ఆ తర్వాత వచ్చిన ప్రభుత్వం దివ్యాంగులకు ఒక్క రూపాయి కూడా పెంచలేదు. 2024లో కూటమి ప్రభుత్వం వచ్చాక మళ్లీ ఆ పెన్షన్ను రూ.6000 చేశాం. దివ్యాంగులను ఆదుకునే అవకాశాన్ని భగవంతుడు అందించారు. 2024 ఎన్నికల్లో టీడీపీ, జనసేన, బీజేపీ కలిసి పని చేశాం. రాష్ట్ర పునర్నిర్మాణం జరగాలి.. పేదలను ఆదుకోవాలని ఆ ఎన్నికల్లో కలిశాం. 94 శాతం స్ట్రైక్ రేట్ తో కూటమి అభ్యర్థులు గెలిచారు. 2024 సార్వత్రిక ఎన్నికల్లో కూటమి అధికారంలోకి రాకుండా ఉంటే దివ్యాంగుల పింఛన్లు పెరిగేవి కాదు. దివ్యాంగ శక్తి పథకం వచ్చేది కాదు. స్కూటర్లు ఇచ్చినా ట్రై సైకిళ్లు అందించినా దివ్యాంగులను మిగతా వారికంటే ఎక్కువ ఆదరించాలి. దివ్యాంగులకు ల్యాప్ టాప్‌లు అందించాం. వారికి మరింత మంచి చేస్తాం... మంచి చేసిన వారిని గుర్తుంచుకోవాలి. జరిగిన మంచిని 10 పది మందికి చెప్పాలి. సుస్థిర ప్రభుత్వం ఉంటే అభివృద్ధి పెద్ద ఎత్తున జరుగుతుంది. ప్రతినెలా పేదల సేవలో కార్యక్రమం ద్వారా తెల్లవారు ఝామునే పింఛను ఇస్తున్నాం. అప్పులు చేసినా, కేంద్రం నుంచి నిధులు తెచ్చినా పేదల సంక్షేమం కోసమే. పట్టుదలకు దివ్యాంగులు మారుపేరు. కఠోర శ్రమతో సాధించే వరకు నిద్రపోరు. దివ్యాంగులకు క్రీడలు కూడా నిర్వహించాం...రాష్ట్రంలో ముందుకు వచ్చిన దివ్యాంగులకు శిక్షణ ఇచ్చి జాతీయ, అంతర్జాతీయ క్రీడలకు వెళ్లేలా చేస్తాం. గత ప్రభుత్వం చాలా తప్పులు చేసింది. దివ్యాంగుల పేరుతో బాగున్న వారు కూడా పింఛన్లు, ఉద్యోగాలు పొందారు. ఇది చాలా నీచం బాధాకరం."అని ముఖ్యమంత్రి చెప్పారు.

--కూటమి కలకాలం ఉండాలి: దివ్యాంగులు

సీఎం చంద్రబాబు ఇచ్చిన ఆత్మీయ విందుకు హాజరైన పలువురు దివ్యాంగులు తమ అభిప్రాయాలను... తమ భావాలను ముఖ్యమంత్రి చంద్రబాబు, మంత్రి లోకేష్ తో పంచుకున్నారు. కూటమి ప్రభుత్వం 15 ఏళ్లు ఇలాగే కలిసి ఉండాలని... ప్రభుత్వం కొనసాగాలని కోరుకున్నారు. మంచి ప్రభుత్వం కొనసాగితే... తమకు సంక్షేమ పథకాలు ఇలాగే అందుతూ ఉంటాయని చెప్పారు. దివ్యాంగులుగా పుట్టినందుకు బాధగా ఉన్నా...ప్రభుత్వం తమను చూసుకుంటున్న విధానంతో సంతోషంగా ఉందన్నారు. తమను క్రీడల్లో కూడా ప్రోత్సహిస్తున్నారని...గత ప్రభుత్వాలు తమను పట్టించుకోలేదని పలువురు దివ్యాంగులు అభిప్రాయపడ్డారు. దివ్యాంగుల ముసుగులో కొందరు పింఛన్లు పొందుతున్నారని... పింఛన్ల వెరిఫికేషన్ చేయాలని ముఖ్యమంత్రిని కోరారు. అన్ని అవయవాలు సవ్యంగా ఉన్నారు కూడా దివ్యాంగులమని తప్పుడు సర్టిఫికెట్లు తెచ్చుకుని ప్రభుత్వ కోటాలో ఉద్యోగాలు పొందుతున్నారని... అలాంటి వారిని గుర్తించేలా వెరిఫికేషన్ చేయాలని సీఎంకు కొందరు దివ్యాంగులు విజ్ఞప్తి చేశారు.

# తెలంగాణలో అసెంబ్లీ ఎన్నికలు 2029లోనే



ఈకబురు,దిల్లీ: తెలంగాణలో అసెంబ్లీ ఎన్నికలు షెడ్యూల్ ప్రకారం 2028లో రావని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు. 2029లో లోక్‌సభ, అసెంబ్లీలకు ఒకేసారి జమిలి ఎన్నికలు జరుగుతాయని అభిప్రాయపడ్డారు. కేంద్ర ప్రభుత్వం చట్టసభల్లో మహిళా రిజర్వేషన్లను 2034కి బదులుగా 2029 ఎన్నికల్లోనే అమలుచేసేందుకు వీలుగా నారీశక్తి వందన్ అధినియమ్‌ను సవరణ చేసేందుకు సమాయత్తమవుతున్నట్లు వార్తలు వస్తున్న నేపథ్యంలో ఆ విషయంపై విలేకర్లు ముఖ్యమంత్రి అభిప్రాయాన్ని కోరినప్పుడు ఆయన పైవిధంగా స్పందించారు. మహిళా రిజర్వేషన్లు ఎప్పటి నుంచి అమల్లోకి వచ్చినా తెలంగాణలో అసెంబ్లీ ఎన్నికలు మాత్రం 2029లోనే జరుగుతాయని, అందువల్ల ఈ రిజర్వేషన్లతో తమకేమీ ఇబ్బంది ఉండదన్నారు. రాజ్యసభకు కొత్తగా ఎన్నికైన మిత్రుడు వేం నరేందర్‌రెడ్డిని వెంటబెట్టుకొని సీఎం బుధవారం ఉదయం పార్లమెంటుకు వచ్చి అక్కడ రాహుల్‌గాంధీ, ప్రియాంకాగాంధీలకు ఆయన్ను పరిచయంచేసి మాట్లాడారు. అనంతరం విలేకర్లు అడిగిన ప్రశ్నలకు బదులిచ్చారు. మొయినాబాద్ ఫాంహౌస్ డ్రగ్స్ కేసులో కొందరు వ్యక్తులకు స్టేషన్ బెయిల్ ఇవ్వడం గురించి స్పందిస్తూ ఆ విషయంలో నిబంధనల ప్రకారమే పోలీసులు నడుచుకున్నారని, అందులో ఎవ్వరికీ ఎలాంటి ప్రమేయం ఉండదన్నారు. ఆ మొత్తం వ్యవహారంపై దర్యాప్తు కోసం తాము సిట్ ఏర్పాటు చేశామని చెప్పారు. రాహుల్‌గాంధీ, ప్రియాంకా గాంధీని కలిసిన సమయంలో ముఖ్యమంత్రి వెంట పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్, ఎంపీలు మల్లురవి, సురేశ్‌షెట్కార్, అనిల్‌కుమార్‌యాదవ్, చామల కిరణ్‌కుమార్‌రెడ్డి, రామసహాయం రఘురాంరెడ్డి, దిల్లీలో రాష్ట్ర ప్రభుత్వ



## స్వచ్ఛందంగా అమెరికాను వదిలి వెళ్తే 2,600 డాలర్లు

వాషింగ్టన్: స్వచ్ఛందంగా అమెరికాను వదిలివెళ్లే అక్రమ వలసదారులకు 2,600 డాలర్లు (రూ.2,40,329) ఎగ్జిట్ బోనస్ అందించనున్నట్లు ట్రంప్ యంత్రాంగం ప్రకటించింది. దీంతోపాటు వారి స్వదేశాలకు విమానంలో ఉచితంగా పంపించడానికి ఏర్పాట్లు చేస్తామని హోమ్‌లాండ్ సెక్యూరిటీ విభాగం ఓ ప్రకటనలో తెలిపింది. తాము స్వదేశానికి తిరిగివెళ్లేందుకు సిద్ధమేనని 'సీబీపీ హోమ్' యాప్ ద్వారా ప్రభుత్వానికి తెలియజేసే వారి పేర్లను బలవంతంగా స్వదేశానికి తరలించాల్సిన వారి జాబితా నుంచి తొలగిస్తామని తెలిపింది. అక్రమ వలసదారులను స్వదేశాలకు పంపడానికి 2025 జనవరిలో అమెరికా చర్యలు ప్రారంభించినట్లు హోమ్‌లాండ్ సెక్యూరిటీ విభాగం పేర్కొంది. తాము ఇస్తున్న ఆఫర్‌లను వినియోగించుకొని.. అప్పటినుంచి ఇప్పటివరకు 22 లక్షలకు పైగా అక్రమ వలసదారులు తమ దేశాలకు తిరిగివెళ్లినట్లు వెల్లడించింది.

# రాజకీయాల్లో ఫుల్‌స్టాప్ ఉండదు



ఈకబురు,దిల్లీ: ఫుల్‌స్టాప్ అనేది రాజకీయాల్లో ఉండదని ప్రధానమంత్రి నరేంద్రమోదీ ఉద్ఘాటించారు. ఈ ఏడాది ఏప్రిల్‌జులై మధ్య పదవీవిరమణ చేయబోతున్న 59 మంది రాజ్యసభ సభ్యులకు బుధవారం ఎగువసభలో వీడ్కోలిచ్చారు. వీరు అందించిన సేవల్ని ప్రధాని కొనియాడుతూ.. పార్లమెంటు అనేది సార్వత్రిక విశ్వవిద్యాలయమని చెప్పారు. పదవీ విరమణ చేస్తున్నవారు దేశానికి సంబంధించిన అంశాల్లో క్రియాశీలంగా ఉండాలని కోరారు. ''..ఇలాంటి వీడ్కోలు కార్యక్రమాలు మనలో విభేదాలు సమసిపోయేలా చేస్తాయి. ఇలాంటి సందర్భాల్లో మనం భిన్నాభిప్రాయాలను పక్కనపెట్టి ఉమ్మడి భావాలను పంచుకుంటాం. రిటైరవుతున్నవారి జీవితం ఇక్కడితో ముగిసిపోయినట్లు కాదు. వారికీ భవిష్యత్తు ఉంటుంది. వారి అనుభవం, సేవలు దేశానికి ఎప్పటికీ గుర్తుంటాయి. రిటైరవుతున్న మాజీ ప్రధాని హెచ్.డి.దేవెగౌడ, విపక్షనేత మల్లికార్జున ఖర్గే, ఎన్సీపీ అధిపతి శరద్‌పవార్‌లు దిగ్గజాలు. వీరు తమ జీవితాల్లో సగభాగాన్ని పార్లమెంటరీ కార్యకలాపాలకే వెచ్చించారు.. ఎంతో అంకిత భావంతో సభకు హాజరవుతూ వస్తున్నారు. కొత్త సభ్యులకు ఇది స్ఫూర్తినిస్తుంది. ఇంతకాలం పాటు కొనసాగడం చిన్న అంశం కాదు. డిప్యూటీ ఛైర్మన్ హరివంశ్ ఎంతో మృదువుగా మాట్లాడే వ్యక్తి అయినా కఠిన నిర్ణయాలు తీసుకుంటారు. దేశం నలుమూలలా ఆయన పర్యటిస్తూ, యువతరంతో ముచ్చటిస్తూ, వారిలో చైతన్యం రగిలించేందుకు పాటుపడ్డారు. కేంద్ర మంత్రి రాందాస్ అఠావలె ఎవర్‌గ్రీన్ నేత. నిరంతరం మీడియా కళ్లు మనపై ఉండటం మూలాన సభలో ఛలోక్తులు, హాస్యభరిత ఘటనలు తగ్గాయి'' అని మోదీ చెప్పారు.

రెండు సభల విధానంతో మేలు


పార్లమెంటులో రెండుసభలు ఉండటం వల్ల ఒక అంశంపై రెండో అభిప్రాయం తెలుసుకునేందుకు వీలవుతూ ప్రజాస్వామ్యంలో నిర్ణాయక ప్రక్రియను బలోపేతం చేస్తోందని మోదీ అన్నారు. కుటుంబంలోనైనా కీలక నిర్ణయాలు తీసుకోవాల్సి వచ్చినప్పుడు సభ్యులంతా కూర్చొని ఏకాభిప్రాయాన్ని సాధిస్తారని చెప్పారు. ఆరేళ్ల పదవీకాలంలో పలువురు సభ్యులు పార్లమెంటు పాత, కొత్త భవనాల్లో సేవలు అందించారని గుర్తుచేశారు. పార్లమెంటులో అనుభవం ఎంతో విస్తారమైనదని పేర్కొన్నారు. 20 రాష్ట్రాలకు చెందిన 59 మంది సభ్యుల పదవీకాలం రాబోయే నాలుగు నెలల్లో ముగుస్తోందని, వారిలో 9 మంది మహిళలని రాజ్యసభ ఛైర్మన్ సి.పి.రాధాకృష్ణన్ చెప్పారు. పదవీ విరమణను కొత్త బాధ్యతలకు నాందిగా చూడాలన్నారు.

ఖర్గే మాట్లాడుతూ దేవెగౌడతో తనకు 54 ఏళ్లకు పైగా ఉన్న అనుబంధాన్ని గుర్తుచేసుకున్నారు. ''రాజకీయాల్లో, ప్రజా జీవితంలో ఉన్నవారు దేశానికి సేవ చేయాలనే తపనతో అలసిపోరు, విరమించుకోరు. నేను దేవెగౌడతో చాలాకాలం పని చేశాను. ఆ తర్వాత ఏమైందో తెలియదు. ఆయన మమ్మల్ని ప్రేమించి, మోదీని పెళ్లి చేసుకున్నారు'' అని చమత్కరించారు. ఆ మాటలకు ప్రధాని కూడా నవ్వులు చిందించారు. కాంగ్రెస్‌తో తనకు జరిగింది 'బలవంతపు పెళ్లి' అని, ఆ బంధంలో హింస కారణంగా 'విడాకులు' తీసుకోవాల్సి వచ్చిందని దేవెగౌడ 'ఎక్స్'లో పోస్ట్ చేశారు. ఖర్గే వ్యాఖ్యలపై తానూ అంతే సరదాగా స్పందిస్తున్నానన్నారు. 'కాంగ్రెస్ కూటమిని నేను వదిలేయలేదు. వాళ్లే నన్ను వదిలి వెళ్లిపోయారు. విడాకులు తీసుకునే పరిస్థితి తెచ్చి మరింత సుస్థిర కూటమిని ఎంచుకునేలా చేశారు' అని చురక అంటించారు.

## డీజీపీ సెలక్షన్ ఫైనల్ లిస్టు ప్రభుత్వం వద్దకు!

ఈకబురు,హైదరాబాద్, : పూర్తిస్థాయి డీజీపీ నియామకానికి సంబంధించి యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (యూపీఎస్సీ) నుంచి ముగ్గురి పేర్లతో కూడిన జాబితా బుధవారం రాష్ట్ర ప్రభుత్వానికి చేరిందని సమాచారం. తుది జాబితాలో 1991 బ్యాచ్ ఐపీఎస్ అధికారి సీవీ ఆనంద్, 1994 బ్యాచ్ ఐపీఎస్ అధికారులు వీపీ ఆప్టే, సౌమ్యా మిశ్రాల పేర్లు ఉన్నట్లు తెలుస్తోంది. ఇందులో సీనియర్‌గా ఉన్న సీవీ ఆనంద్‌ను డీజీపీగా నియమించనున్నారని సమాచారం. అదే సమయంలో ప్రస్తుత డీజీపీ శివధర్ రెడ్డి వచ్చేనెల 30న రిటైర్ అవుతున్న క్రమంలో ఆయన్ను రాష్ట్ర ప్రభుత్వ సలహాదారుగా నియమించనున్నారని ప్రభుత్వ వర్గాల ద్వారా తెలుస్తోంది.

## డాక్టర్ కేశవ్ బలిరామ్ హెడ్గేవార్..
# స్వయం సేవా స్ఫూర్తిప్రదాత



ఈ విశాల భారతదేశమంతా మన ఇల్లు, ఇక్కడి వారంతా మన సోదరులు అనే నినాదంతో శతాబ్దం క్రితమే స్వయం సేవా విప్లవానికి బాటలు పరచిన క్రాంతదర్శి డాక్టర్ కేశవ్ బలిరామ్ హెడ్గేవార్. జాతీయవాద ఉద్యమాన్ని ఓ చిన్న పాయగా ప్రారంభించి... ప్రపంచ వ్యాప్తంగా రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ అంటే ఓ గుర్తింపు, గౌరవం ప్రస్ఫుటమయ్యేలా తీర్చిదిద్దిన ఆయన స్ఫూర్తి మహోన్నతమైనది. సకారాత్మక ఆలోచనలతో ధర్మపరిరక్షణకు నిలబడాల్సిన ఆవశ్యకతను చాటిచెప్పిన డాక్టర్‌జీ దూరదృష్టి అజరామరమైనది.

ధర్మ సంరక్షణే సంఘ కార్యమంటూ ఆర్.ఎస్.ఎస్. సభ్యులు నిత్యం సంకల్పం చెప్పుకొంటారు. ధర్మ పరిరక్షణకోసం సదా జాగరూకతతో వ్యవహరించాలన్నది ఇందులోని అంతరార్థం. ఈ స్ఫూర్తిని భారతావనిలో నాటిన క్రాంతదర్శి డాక్టర్ కేశవ్ బలిరామ్ హెడ్గేవార్. నాడు ఆయన నాటిన మొక్క శాఖోపశాఖలుగా విస్తరించి, వందేళ్ల మహావృక్షమై, తన బలమైన వేళ్లతో దేశానికి, ధర్మానికి రక్షణగా నిలుస్తోంది. ఇలాంటి మహోన్నత ఆలోచనకు బీజం వేసిన డాక్టర్‌జీ... 1889, విరోధి నామ సంవత్సర ఉగాది రోజున జన్మించారు. వారి మూలాలు నేటి తెలంగాణ రాష్ట్రం, నిజామాబాద్ జిల్లాలోని కందకుర్తికి చెందినవి. హెడ్గేవార్ తాతగారి హయాంలో వారి కుటుంబం మహారాష్ట్రకు వలసవెళ్లింది. కందకుర్తిలోని కేశవ స్మృతి మందిరం, ఇవాళ ఆయన స్ఫూర్తివెలుగులను పంచుతోంది.

దేశభక్తిని, ధర్మవర్తనను నరనరాన నింపుకొన్న హెడ్గేవార్, పాఠశాలలో చదివే రోజుల్లోనే 'వందేమాతరం' అని నినదించి పాఠశాల నుంచి బహిష్కృతులయ్యారు. కలకత్తాలో వైద్య విద్యను అభ్యసిస్తున్నప్పుడు స్వాతంత్ర్య సమరయోధులతో ఏర్పడిన పరిచయాలు ఆయనను స్వరాజ్య ఉద్యమం వైపు నడిపించాయి. లాలాలజపతి రాయ్, బాలగంగాధర్ తిలక్ వంటి మహనీయుల స్ఫూర్తితో జాతీయవాద భావాలను అందిపుచ్చుకున్నారు. మహాత్ముని అహింసా సత్యాగ్రహాల్లో చురుగ్గా పాల్గొన్నారు. నాలుగుసార్లు జైలు శిక్షను అనుభవించారు. బ్రిటిష్ పాలనతో సమాజంలో బలంగా వేళ్లూనుకుంటున్న విభేదాలు, వివక్షలతో పాటు పాశ్చాత్య మనస్తత్వం వంటి జాడ్యాలు నిజమైన స్వాతంత్ర్యానికి అడ్డంకులుగా నిలుస్తాయని ఆయన గ్రహించారు. అందుకే సమాజంలో ఐక్యతను పెంపొందించేందుకు, ధర్మ పరిరక్షణ కోసం 36 ఏళ్ల వయసులో 1925లో విజయదశమి పర్వదినాన నాగ్‌పుర్‌లో రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్‌ను ఏర్పాటుచేశారు.

అసమానతలు లేని దేశం కోసం...

స్వతంత్ర భారత దేశానికి యువతే వెన్నెముక అని డాక్టర్‌జీ భావించారు. యువత సామాజిక బాధ్యతతో దేశాన్ని అభివృద్ధి పథంలో నడిపించాలని ఆకాంక్షించారు. ఇందుకోసం వారిలో క్రమశిక్షణతో కూడిన చారిత్రక స్పృహను పెంచాలని తపించారు. అదే విధంగా యువత శారీరకంగా, మానసికంగా దృఢంగా ఉండాలన్నది ఆయన ఆలోచన. అందుకే 'శాఖ' అనే వినూత్న పద్ధతిని ప్రవేశపెట్టారు. నేను కూడా కబడ్డీ ఆడాలనే తలంపుతోనే ముందుగా శాఖలో చేరాను. ఆ తరవాత భోగాది దుర్గాప్రసాద్, సోమేపల్లి సోమయ్య లాంటి మహనీయుల స్ఫూర్తితో ఎదిగాను. అలాగే, సంఘ్‌లో కులమతాల ప్రస్తావన, ధనికపేద తేడా ఉండదు. ఎంతటి ఉన్నత వ్యక్తులైనా సంఘ్ ముందు అంతా సమానమే. సంఘ్ సభ్యులందరూ కలిసి భోంచేస్తారు, కలిసి ఆటలు ఆడతారు, ఆలోచనలు పంచుకుంటారు, పెద్దల ప్రసంగాలను వింటారు. ఇలాంటి కార్యక్రమాల ద్వారా ఐక్యతను సాధించగలమన్న భవిష్యత్ దర్శనం డాక్టర్‌జీ సొంతం. 1930లలో ఆర్.ఎస్.ఎస్. శాఖను స్వయంగా సందర్శించిన గాంధీ మహాత్ముడు... సంఘ్ క్రమశిక్షణ, నిరాడంబరతలను ప్రశంసించారంటే డాక్టర్‌జీ నిబద్ధత, దూరదృష్టి అవగతం అవుతాయి.

దేశ భవిష్యత్‌ను మహిళలు సానుకూల మార్గంలో ముందుకు నడపగలరన్నది హెడ్గేవార్ విశ్వాసం. భారతీయ సంస్కృతిలో 'శక్తి స్వరూపిణి'గా పూజలందుకున్న మహిళా మూర్తుల సాధికారత సాకారం కావాలన్నది ఆయన ఆకాంక్ష. అందుకే లక్ష్మీబాయి కేల్కర్ (మౌశీజీ) ఆధ్వర్యంలో రాష్ట్ర సేవికా సమితి ఏర్పాటుకు మార్గదర్శనం చేశారు.

వికసిత భారత నిర్మాణంలో...

తొలుత సంఘ్‌ను రాజకీయాల నుంచి దూరంగా ఉంచాలని డాక్టర్‌జీ భావించారు. అయితే శ్యామా ప్రసాద్ ముఖర్జీ, పండిట్ దీన్ దయాళ్ ఉపాధ్యాయ లాంటి మహనీయులు రాజకీయాల్లో సంఘ్ స్ఫూర్తి అవసరమని విశ్వసించారు. ఫలితంగా సంఘ్ ఆలోచనల ప్రేరణ, భారతీయ తత్వంతో భారతీయ జనసంఘ్, నేటి భారతీయ జనతా పార్టీకి రూపకల్పన జరిగింది. అయితే, సంఘ్ మాత్రం రాజకీయాల్లో ఏవిధమైన జోక్యం చేసుకోదు. డాక్టర్ హెడ్గేవార్ కలలు నేడు ఒక్కొక్కటిగా సాకారం అవుతున్నాయి. ఎమ్మెల్యేలు, ఎంపీలు, ముఖ్యమంత్రులు, గవర్నర్లు వంటి వారితో పాటు ప్రధానమంత్రి, ఉపరాష్ట్రపతి, రాష్ట్రపతి వంటి అత్యున్నత స్థానాల వరకూ ఆర్.ఎస్.ఎస్. స్ఫూర్తిని నింపుకొన్న వారు బాధ్యతలు చేపట్టి దేశాన్ని ప్రగతి పథంలో నడిపిస్తున్నారు. 'ఆద్య సర్ సంఘచాలక్' హెడ్గేవార్ ప్రేరణతోనే ఇదంతా సాధ్యమైంది. డాక్టర్‌జీ తన కోసం ఏనాడూ జీవించలేదు. నిరాడంబర రీతిలో సంఘ్ మూలాలను బలోపేతం చేశారు. అందుకే నేటికీ ఆర్.ఎస్.ఎస్. ఒక కుటుంబానికో, వ్యక్తికో పరిమితం కాకుండా సమాజ నిర్మాణంలో తనదైన బాధ్యతను నిర్వర్తిస్తోంది.

ప్రపంచంలో శతాబ్ద పయనాన్ని పూర్తిచేసుకున్న సంస్థలు చాలా అరుదు. అందులో భారతీయ విలువలకు పట్టం కట్టిన రాష్ట్రీయ స్వయం సేవక్ నిలవడం ముదావహం. ఈ సందర్భంలో వచ్చిన డాక్టర్‌జీ జయంతి ఎంతో ప్రత్యేకమైనది. 'బలము, ఐక్యత, ఆత్మగౌరవం లేని జాతి చెప్పే మాటలకు ప్రపంచంలో ఏ విలువ ఉండదు' అన్న ఆయన మాటలు అక్షర సత్యాలు. సంఘటిత శక్తి, సమగ్రమైన దేశాన్ని నిర్మిస్తుంది. 'దేశమంటే మనుషులోయ్' అంటూ గురజాడ ప్రవచించిన స్ఫూర్తిని రగిలిస్తుంది. ఈ మార్గంలో ధర్మపరిరక్షణ కోసం ప్రతి ఒక్కరూ నిబద్ధులై సాగాలి. దేశహితం కోసం ప్రతిరోజు కొంత సమయాన్ని కేటాయించడం, వివక్షలు లేని సమాజానికి బాటలు వేయడం, కష్టాల్లో ఉన్న వారికి ఆపన్నహస్తం అందించడమే డాక్టర్ కేశవ్ బలిరామ్ హెడ్గేవార్‌కు అందించే నిజమైన నివాళి. ఆయన స్ఫూర్తితో యువతరం వికసిత భారత నిర్మాణానికి చోదక శక్తులు కావాలని ఆకాంక్షిస్తున్నాను.

## గల్ఫ్ దేశాల నుంచి దిగుమతులకు
# స్థానిక కరెన్సీల్లోనే చెల్లింపులు



గల్ఫ్ దేశాలకు వాణిజ్య చెల్లింపులను ఆయా దేశాల స్థానిక కరెన్సీల్లోనే చేసేందుకు ఉన్న మార్గాలను భారత్ అన్వేషిస్తున్నట్లు తెలుస్తోంది. ప్రస్తుత భౌగోళిక రాజకీయ ఆందోళనల నేపథ్యంలో చమురు సహా ఇతర వస్తువుల దిగుమతుల బిల్లు పెరగకుండా చూడాలన్నదే దీని వెనక ప్రభుత్వ ఉద్దేశంగా కనిపిస్తోంది. 'అంతర్జాతీయ అనిశ్చితుల వల్ల సరఫరా పరమైన అవరోధాలు ఏర్పడుతున్నాయి. చమురు, పెట్రోలియం ఉత్పత్తులు సహా పలు వస్తువుల దిగుమతుల బిల్లు పెరుగుతోంది. అందుకే అంతర్జాతీయ అనిశ్చితులు ఎప్పుడు తలెత్తినా.. ఆ ప్రభావం నుంచి దిగుమతుల బిల్లును కాపాడుకోవాలని భారత్ అనుకుంటోంద'ని ప్రభుత్వ అధికారి ఒకరు వెల్లడించినట్లు ఓ ఆంగ్ల వార్తా కథనం తెలిపింది. పశ్చిమాసియా ప్రాంతంలో ఉద్రిక్తతల కారణంగా బ్రెంట్ ముడిచమురు బ్యారెల్ ధర 70 డాలర్ల నుంచి పెరిగి ఏకంగా 110 డాలర్లను మించిన సంగతి తెలిసిందే. భారత్ తన ముడి చమురు అవసరాల్లో 85 శాతం వరకు దిగుమతులపైనే ఆధారపడుతున్నందున.. ఇటీవలి ధరల పెరుగుదల వల్ల భారత్‌కు దిగుమతి బిల్లు భారీగా పెరగనుంది. ఈ ప్రభావం వాణిజ్య లోటు, ద్రవ్యోల్బణం మీద కనిపించనుంది. మరోవైపు 202425లో భారత్ మొత్తం చమురు దిగుమతుల్లో గల్ఫ్ దేశాల నుంచే 28% ఉన్నాయి. ఈ నేపథ్యంలో స్థానిక కరెన్సీల్లో వాణిజ్య చెల్లింపులు చేస్తే.. దిగుమతి బిల్లుపై పడే భారాన్ని కొంతైనా తగ్గించుకోవచ్చన్నది ప్రభుత్వ ఆలోచనగా కనిపిస్తోంది.

## ప్రపంచవ్యాప్తంగా 'ఎక్స్' సేవల్లో అంతరాయం!



ప్రముఖ మైక్రో బ్లాగింగ్ వేదిక 'ఎక్స్' సేవల్లో అంతరాయం ఏర్పడింది. సాంకేతిక సమస్య కారణంగా భారత్ సహా ప్రపంచవ్యాప్తంగా సర్వీసులు డౌన్ అయినట్లు సమాచారం. డౌన్‌డిటెక్టర్ వెబ్‌సైట్ ప్రకారం.. రాత్రి ఎనిమిది గంటల నుంచి సేవలకు అంతరాయం ఏర్పడినట్లు తెలుస్తోంది. మొబైల్, డెస్క్‌టాప్ వెర్షన్‌లలో ఈ ఇబ్బందులు ఎదురైనట్లు పలువురు యూజర్ల నుంచి ఫిర్యాదులు వెల్లువెత్తాయి. రిప్లైలను చూడటం, టైమ్‌లైన్‌లను రీఫ్రెష్ చేయడంతోపాటు కొత్త పోస్టుల్లోనూ సమస్యలు వచ్చినట్లు పేర్కొంటున్నారు. ఢిల్లీ, ముంబయి, బెంగళూరు, హైదరాబాద్, చెన్నై నగరాల్లోని యూజర్ల నుంచి అనేక ఫిర్యాదులు వస్తున్నాయి. అయితే, దీనిపై 'ఎక్స్' నుంచి స్పందన రావాల్సి ఉంది.

## పాన్ రూల్స్ కఠినతరం..
# ఆధార్‌తో దరఖాస్తు మార్చి 31 వరకే




శాశ్వత ఖాతా సంఖ్యకు (PAN) సంబంధించిన దరఖాస్తు నిబంధనలు కొత్త ఆర్థిక సంవత్సరం నుంచి కఠినతరం కానున్నాయి. ఏప్రిల్ 1 నుంచి ఆధార్ కార్డుతో పాన్ దరఖాస్తులను అనుమతించబోరు. అంటే ఎవరైనా ఆధార్ కార్డు సాయంతో పాన్ పొందాలనుకుంటే మార్చి 31 వరకే గడువు ఉంది. కాబట్టి కొత్తగా పాన్ కోసం దరఖాస్తు చేసుకోవాలనుకుంటే నిర్ణీత గడువులోగా ఆ ప్రక్రియను పూర్తి చేయాలని కేంద్రానికి చెందిన కామన్ సర్వీస్ ఎంటర్ ఎక్స్ వేదికగా ఓ పోస్ట్ పెట్టింది.
బ్యాంకింగ్, ఆర్థిక లావాదేవీలకు కీలకమైన పాన్‌ను పొందాలంటే ఏప్రిల్ 1 నుంచి ఆధార్‌తో పాటు అదనపు డాక్యుమెంట్లను సమర్పించాల్సి ఉంటుంది. పుట్టిన తేదీని ధ్రువీకరించే పత్రాలు ఇందుకు అవసరం అవుతాయి. బర్త్ సర్టిఫికెట్, ఓటర్ ఐడీ కార్డు, మెట్రిక్యులేషన్ సర్టిఫికెట్, డ్రైవింగ్ లైసెన్స్, అఫిడవిట్, పాస్ట్ పోర్ట్ వంటి పత్రాల్లో ఏదో ఒకటి సమర్పించాల్సి ఉంటుంది. కొత్త రూల్స్ అమల్లోకి వచ్చాక దరఖాస్తు ఫారాలు కూడా మారనున్నాయని కామన్ సర్వీస్ సెంటర్ పేర్కొంది. ఆన్‌లైన్‌లో కొత్త పాన్ కార్డు కోసం Protean, UTITSL వెబ్‌సైట్లను సందర్శించాలని సూచించింది. తక్షణమే ఇపాన్ పొందాలంటే ఆదాయపు పన్ను ఇఫైలింగ్ పోర్టల్‌లో కూడా పొందొచ్చు.



### రక్షణ ఎలక్ట్రానిక్స్ రంగంలోకి అమర రాజా

హైదరాబాద్: అమర రాజా గ్రూపు ఆధ్వర్యంలోని ప్రత్యేక ఇంజినీరింగ్ పరిశోధన, అభివృద్ధి (ఆర్ అండ్ డీ) సంస్థ అమర రాజా డిజైన్ ఆల్ఫా (ఏఆర్‌డీఏ) అత్యంత కీలకమైన రక్షణ ఎలక్ట్రానిక్స్ రంగంలోకి ప్రవేశిస్తున్నట్లు తెలిపింది. నావికాదళ సోనార్ వ్యవస్థల కోసం స్వదేశీ పరిజ్ఞానంతో రూపొందించిన పవర్ కండిషనింగ్ క్యాబినెట్ (పీసీసీ)ని అభివృద్ధి చేసినట్లు వెల్లడించింది. తదుపరి దశలో పవర్ యాంప్లిఫయర్లు, సిగ్నల్ ఇంటర్‌ఫేస్‌లు, పవర్ యాంప్లిఫయర్ క్యాబినెట్ల డిజైన్ల రూపకల్పనలోకి సైతం కార్యకాలాపాలను విస్తరిస్తామని, తద్వారా నావికాదళ సోనార్ వ్యవస్థల కోసం ఒక సమగ్రమైన స్వదేశీ వ్యవస్థను నిర్మించనున్నట్లు తెలిపింది. భారత్ విస్తృతంగా చేపడుతున్న నావికాదళ స్వయం సమృద్ధి ప్రయత్నాలకు ఇది సహకారం అందిస్తుందని పేర్కొంది. ఈ వ్యవస్థలోని విడిభాగాల్లో దాదాపు 61 శాతం స్వదేశీ పరిజ్ఞానంతో తయారయ్యాయని, అధునాతన పవర్ ఇంజినీరింగ్, స్థానిక తయారీ సామర్థ్యాల ద్వారా సుమారు 40 శాతం మేర వ్యయం ఆదా అవుతుందని సంస్థ స్పష్టం చేసింది.
భారత నావికాదళ బడ్జెట్ 2020-21 ఆర్థిక సంవత్సరంలో ఉన్న రూ.49,623 కోట్ల నుంచి 2025-26 నాటికి రూ.1,03,548 కోట్లకు పెరిగింది. సముద్ర మార్గాల్లో రక్షణ సామర్థ్యాన్ని పెంచుకోవడంపై భారత్ చేస్తున్న విస్తృత పెట్టుబడులకు ఇది అద్దం పడుతోందని సంస్థ వివరించింది. నావికాదళ నౌకా సమూహంలో సముద్రగర్భ నిఘా, జలాంతర్గామి వ్యతిరేక యుద్ధ కార్యకలాపాల్లో సోనార్ వ్యవస్థలు అత్యంత కీలక పాత్రను పోషిస్తాయని తెలిపింది.

## ఫార్మా ఎగుమతుల్లో 7.77% వృద్ధి: ఫార్మాగ్జిల్



హైదరాబాద్: దేశం నుంచి మందులు, ఫార్మాస్యూటికల్ ఉత్పత్తుల ఎగుమతులు ఫిబ్రవరిలో రూపాయల రూపేణ 7.77 శాతం వృద్ధిని నమోదు చేశాయి. 202526 ఆర్థిక సంవత్సరం 11 నెలల కాలానికి గాను వార్షిక ప్రాతిపదికన 5.6 శాతం పెరిగాయి. పరిశ్రమల మంత్రిత్వ శాఖ ప్రాథమిక గణాంకాల ప్రకారం గతేడాది ఫిబ్రవరిలో రూ.21,540.08 కోట్లుగా ఉన్న మందులు, ఫార్మా ఎగుమతులు గత నెలలో రూ.23,212.81 కోట్లుగా నమోదయ్యాయి. ఈ ఆర్థిక సంవత్సరం తొలి 11 నెలల వ్యవధిలో ఫార్మా ఎగుమతులు రూ.2,48,825.89 కోట్లకు చేరాయి. గత ఆర్థిక సంవత్సరం ఇదే సమయంలో రూ.2,26,098.65 కోట్లుగా ఉన్నాయి. మరోవైపు, దిగుమతులు గత నెలలో రూ.7,674.62 కోట్లుగా ఉన్నాయి.

# సూచీల లాభాల హ్యాట్రిక్



మదుపర్ల కొనుగోళ్లు కొనసాగడంతో వరుసగా మూడో రోజూ దేశీయ సూచీలు లాభాల్లో ముగిశాయి. ముడి చమురు ధరలు స్వల్పంగా శాంతించడం, సానుకూల అంతర్జాతీయ సంకేతాలు ఇందుకు మద్దతుగా నిలిచాయి. డాలర్‌తో పోలిస్తే రూపాయి 49 పైసలు తగ్గి జీవన కాల కనిష్ఠమైన 92.89 వద్ద ముగిసింది. బ్యారెల్ ముడిచమురు 0.10% నష్టంతో 103.3 డాలర్ల వద్ద ట్రేడవుతోంది. ఆసియా మార్కెట్లు మిశ్రమంగా, ఐరోపా సూచీలు నష్టాల్లో ముగిశాయి.
బీఎస్‌ఈలోని నమోదిత కంపెనీల మార్కెట్ విలువ గత మూడు ట్రేడింగ్ రోజుల్లో రూ.9.18 లక్షల కోట్లు పెరిగి రూ.439 లక్షల కోట్ల (4.75 లక్షల కోట్ల డాలర్ల)కు చేరింది.
సెన్సెక్స్ ఉదయం 293 పాయింట్ల (క్రితం ముగింపు 76,070.84) లాభంతో 76,367.55 పాయింట్ల వద్ద ప్రారంభమైంది. రోజంతా అదే జోరు కొనసాగించిన సూచీ, ఇంట్రాడేలో 77,000.22 వద్ద గరిష్ఠాన్ని తాకింది. చివరకు 633.29 పాయింట్ల లాభంతో 76,704.13 వద్ద ముగిసింది. నిఫ్టీ 196.55 పాయింట్లు పెరిగి 23,777.80 దగ్గర స్థిరపడింది.
సెన్సెక్స్ 30 షేర్లలో 24 పరుగులు తీశాయి. ఎటర్నల్ 3.37%, టెక్ మహీంద్రా 3.27%, ఇన్ఫోసిస్ 2.84%, అదానీ పోర్ట్స్ 2.83%, హెచ్‌సీఎల్ టెక్ 2.76%, ఎం అండ్ ఎం 2.68%, టీసీఎస్ 2.07%, యాక్సిస్ బ్యాంక్ 1.94%, ఎల్ అండ్ టీ 1.75%, ఇండిగో 1.70% లాభపడ్డాయి. ఎన్‌టీపీసీ 1.29%, హెచ్‌యూఎల్ 1.04%, సన్‌ఫార్మా 0.94% నష్టపోయాయి. రంగాల వారీ సూచీల్లో.. ఫోకస్డ్ ఐటీ 2.95%, ఐటీ 2.82%, స్థిరాస్తి 2.67%, సేవలు 2.45%, టెలికాం 2.44%, వినియోగ 2.08% రాణించాయి. లోహ ఒక్కటే నిరాశపరిచింది. బీఎస్‌ఈలో 3169 షేర్లు లాభపడగా, 1130 స్క్రిప్‌లు నష్టపోయాయి. 138 షేర్లలో ఎటువంటి మార్పు లేదు.
ఐపీఓ ద్వారా రూ.5000 కోట్లు సమీకరించేందుకు మార్కెట్ల నియంత్రణ సంస్థ సెబీ వద్ద ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ఇన్వెస్ట్‌మెంట్ ట్రస్ట్ (ఇన్విట్) అయిన క్యాబ్ హైవేస్ ట్రస్ట్ ముసాయిదా పత్రాలు దాఖలు చేసింది. ఈ ఐపీఓ పూర్తి ఆఫర్ ఫర్ సేల్‌గా రానుంది.
జీఎస్‌పీ క్రాప్ సైన్స్ ఐపీఓ చివరిరోజు 1.61 రెట్ల స్పందన లభించింది. ఇష్యూలో భాగంగా 89,47,367 షేర్లను ఆఫర్ చేయగా, 1,43,61,844 షేర్లకు బిడ్లు దాఖలయ్యాయి. రిటెయిల్ విభాగంలో 40% స్పందన వచ్చింది.
లెర్నింగ్ కంపెనీ పియర్‌సన్‌తో ఐటీ సేవల దిగ్గజం టీసీఎస్ భాగస్వామ్యం కుదుర్చుకుంది. ఒప్పందంలో భాగంగా కంపెనీలు తమ ఉద్యోగులను ఏఐ ఆధారిత లెర్నింగ్, అసెస్‌మెంట్‌తో భవిష్యత్తు కోసం సిద్ధం చేయడానికి సహకారం ఇచ్చిపుచ్చుకుంటాయి. పియర్‌సన్ తన ఎంటర్‌ప్రైజ్ లెర్నింగ్, అసెస్‌మెంట్ నైపుణ్యాన్ని, టీసీఎస్ కాంటెక్చువల్ ఏఐ, టీసీఎస్ అయాన్ డిజిటల్ లెర్నింగ్ ప్లాట్‌ఫామ్‌లతో జతచేస్తుంది. మదుపర్ల కొనుగోళ్లు కొనసాగడంతో వరుసగా మూడో రోజూ దేశీయ సూచీలు లాభాల్లో ముగిశాయి. ముడి చమురు ధరలు స్వల్పంగా శాంతించడం, సానుకూల అంతర్జాతీయ సంకేతాలు ఇందుకు మద్దతుగా నిలిచాయి. డాలర్‌తో పోలిస్తే రూపాయి 49 పైసలు తగ్గి జీవన కాల కనిష్ఠమైన 92.89 వద్ద ముగిసింది. బ్యారెల్ ముడిచమురు 0.10% నష్టంతో 103.3 డాలర్ల వద్ద ట్రేడవుతోంది. ఆసియా మార్కెట్లు మిశ్రమంగా, ఐరోపా సూచీలు నష్టాల్లో ముగిశాయి.
బీఎస్‌ఈలోని నమోదిత కంపెనీల మార్కెట్ విలువ గత మూడు ట్రేడింగ్ రోజుల్లో రూ.9.18 లక్షల కోట్లు పెరిగి రూ.439 లక్షల కోట్ల (4.75 లక్షల కోట్ల డాలర్ల)కు చేరింది.
సెన్సెక్స్ ఉదయం 293 పాయింట్ల (క్రితం ముగింపు 76,070.84) లాభంతో 76,367.55 పాయింట్ల వద్ద ప్రారంభమైంది. రోజంతా అదే జోరు కొనసాగించిన సూచీ, ఇంట్రాడేలో 77,000.22 వద్ద గరిష్ఠాన్ని తాకింది. చివరకు 633.29 పాయింట్ల లాభంతో 76,704.13 వద్ద ముగిసింది. నిఫ్టీ 196.55 పాయింట్లు పెరిగి 23,777.80 దగ్గర స్థిరపడింది.
సెన్సెక్స్ 30 షేర్లలో 24 పరుగులు తీశాయి. ఎటర్నల్ 3.37%, టెక్ మహీంద్రా 3.27%, ఇన్ఫోసిస్ 2.84%, అదానీ పోర్ట్స్ 2.83%, హెచ్‌సీఎల్ టెక్ 2.76%, ఎం అండ్ ఎం 2.68%, టీసీఎస్ 2.07%, యాక్సిస్ బ్యాంక్ 1.94%, ఎల్ అండ్ టీ 1.75%, ఇండిగో 1.70% లాభపడ్డాయి. ఎన్‌టీపీసీ 1.29%, హెచ్‌యూఎల్ 1.04%, సన్‌ఫార్మా 0.94% నష్టపోయాయి. రంగాల వారీ సూచీల్లో.. ఫోకస్డ్ ఐటీ 2.95%, ఐటీ 2.82%, స్థిరాస్తి 2.67%, సేవలు 2.45%, టెలికాం 2.44%, వినియోగ 2.08% రాణించాయి. లోహ ఒక్కటే నిరాశపరిచింది. బీఎస్‌ఈలో 3169 షేర్లు లాభపడగా, 1130 స్క్రిప్‌లు నష్టపోయాయి. 138 షేర్లలో ఎటువంటి మార్పు లేదు.
ఐపీఓ ద్వారా రూ.5000 కోట్లు సమీకరించేందుకు మార్కెట్ల నియంత్రణ సంస్థ సెబీ వద్ద ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ఇన్వెస్ట్‌మెంట్ ట్రస్ట్ (ఇన్విట్) అయిన క్యాబ్ హైవేస్ ట్రస్ట్ ముసాయిదా పత్రాలు దాఖలు చేసింది. ఈ ఐపీఓ పూర్తి ఆఫర్ ఫర్ సేల్‌గా రానుంది.
జీఎస్‌పీ క్రాప్ సైన్స్ ఐపీఓ చివరిరోజు 1.61 రెట్ల స్పందన లభించింది. ఇష్యూలో భాగంగా 89,47,367 షేర్లను ఆఫర్ చేయగా, 1,43,61,844 షేర్లకు బిడ్లు దాఖలయ్యాయి. రిటెయిల్ విభాగంలో 40% స్పందన వచ్చింది.
లెర్నింగ్ కంపెనీ పియర్‌సన్‌తో ఐటీ సేవల దిగ్గజం టీసీఎస్ భాగస్వామ్యం కుదుర్చుకుంది. ఒప్పందంలో భాగంగా కంపెనీలు తమ ఉద్యోగులను ఏఐ ఆధారిత లెర్నింగ్, అసెస్‌మెంట్‌తో భవిష్యత్తు కోసం సిద్ధం చేయడానికి సహకారం ఇచ్చిపుచ్చుకుంటాయి. పియర్‌సన్ తన ఎంటర్‌ప్రైజ్ లెర్నింగ్, అసెస్‌మెంట్ నైపుణ్యాన్ని, టీసీఎస్ కాంటెక్చువల్ ఏఐ, టీసీఎస్ అయాన్ డిజిటల్ లెర్నింగ్ ప్లాట్‌ఫామ్‌లతో జతచేస్తుంది.

# చమురు 200 డాలర్లకు చేరితే..
# బంగారం, స్టాక్ మార్కెట్ల సంగతేంటి?




అమెరికా, ఇజ్రాయెల్ కలిసి ఇరాన్‌పై యుద్ధం ప్రారంభించాక.. చమురు ధరలు ప్రపంచంపై దాడి చేస్తున్నాయి. ఫలితంగా ద్రవ్యోల్బణం పెరుగుతూ, స్టాక్‌మార్కెట్లు పతనమవుతున్నాయి. యుద్ధం ముగింపునకు వస్తుందని సంకేతాలొచ్చినప్పుడు చమురు ధర కాస్త తగ్గి, మార్కెట్లు కొంచెం కోలుకుంటున్నాయి. అనిశ్చితుల నేపథ్యంలో సురక్షిత పెట్టుబడి సాధనంగా భావించే బంగారం ధర పెరుగుతుందని ఆశించినా.. అందుకు భిన్నమైన పరిస్థితి నెలకొంది. డాలర్‌కు గిరాకీ రావడమే ఇందుకు కారణం. ఉద్రిక్తతలు ఇలాగే కొనసాగి, బ్యారెల్ ముడిచమురు ధర 200 డాలర్లకు చేరే అవకాశాలున్నాయని విశ్లేషకులు అంటున్నారు. అదే జరిగితే భారత స్టాక్ మార్కెట్లు, పసిడి, వెండిపై ఎటువంటి ప్రభావం పడొచ్చంటే..
ప్రపంచ చమురు రవాణాలో అయిదో వంతు జరిగే హార్మూజ్ జలసంధిలో ఆటంకాల వల్ల పలు దేశాలకు ఇంధనం సరఫరా ఆగింది. రోజుకు 15 మిలియన్ బ్యారెళ్ల సరఫరాకు అంతరాయం కలుగుతోందని ఒక కన్సల్టెన్సీ లెక్కవేస్తోంది. ఇది ప్రపంచ గిరాకీలో 15 శాతానికి సమానం. యుద్ధానికి ముందు బ్యారెల్ చమురు ధర సగటున 70 డాలర్ల వద్ద ఉండగా, బుధవారం 108 డాలర్లు మించింది. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్, ఇరాన్ చమురు ఎగుమతులకు కీలకమైన ఖర్గ్ ఐలాండ్‌పై దృష్టి సారించిన నేపథ్యంలో, ధర పెరుగుతోంది. ఉద్రిక్తతలు కొనసాగితే బ్యారెల్ చమురు ధర 200 డాలర్లకు చేరొచ్చని ఇరాన్ హెచ్చరిస్తోంది.

### నిఫ్టీ 21,000కు రావచ్చు: ఎమ్‌కే గ్లోబల్

ఉద్రిక్తతల ఫలితంగా వచ్చే 34 నెలల్లో బ్యారెల్ చమురు ధర 100 డాలర్లకు పైనే కదలాడితే, నిఫ్టీ 50 సూచీ ప్రస్తుతం కంటే 10% పైగా కోల్పోయి, 21,000 పాయింట్ల స్థాయికి చేరొచ్చని ఇన్వెస్ట్‌మెంట్ మేనేజ్‌మెంట్ సంస్థ ఎమ్‌కే గ్లోబల్ అంచనా వేస్తోంది. ఒక వేళ చమురు ధర 200 డాలర్లకు చేరితే, మార్కెట్ల పతనం మరింత తప్పకపోవచ్చంటోంది. చమురు అవసరాల కోసం 88% దిగుమతులపైనే ఆధారపడినందున, ఈ ధరల భారం భారత ఆర్థిక వ్యవస్థపైనా ప్రతికూలంగా ఉంటోందని వివరించింది. కరెంట్ ఖాతా లోటు, విదేశీ మారకపు నిల్వలు, రూపాయి, దేశీయంగా ధరలు.. ఇలా అన్నిటిపైనా ప్రతికూల ప్రభావం కనిపిస్తుందని తెలిపింది. రూపాయి విలువ మరింత పతనమైతే.. దిగుమతి వ్యయాలు ఇంకా పెరుగుతాయి. రంగులు, టైర్లు, రసాయనాల వంటి రంగాలు దెబ్బతింటాయి. ముడి పదార్థాల ధరలు పెరిగితే, ఆయా రంగాల్లోని కంపెనీల మార్జిన్లపై ఒత్తిడి పడుతుంది. ద్రవ్యోల్బణాన్ని అదుపులో ఉంచేందుకు ఆర్‌బీఐ స్థిరీకరణ చర్యలు చేపడితే, ద్రవ్యలభ్యతను తగ్గిస్తుంది. రుణ రేట్లను పెంచుతుంది. ఇటువంటి పరిస్థితుల్లో విదేశీ మదుపర్లు స్టాక్‌మార్కెట్ల నుంచి మరింతగా బయటకు వెళతారు. ఈనెల తొలి పక్షం రోజుల్లోనే దాదాపు రూ.60,000 కోట్ల పెట్టుబడులను విదేశీ మదుపర్లు మన ఈక్విటీ మార్కెట్ల నుంచి ఉపసంహరించారు.

### పసిడి ధరపై భిన్నాభిప్రాయాలు

ఒక వేళ చమురు 200 డాలర్లకు చేరితే, అంతర్జాతీయంగా తీవ్ర ద్రవ్యోల్బణ ఒత్తిళ్లు తప్పవు. ఇలాంటి పరిస్థితుల్లో సాధారణంగా సురక్షిత పెట్టుబడి సాధనంగా భావించి పసిడి పైకి పెట్టుబడులు వస్తే, ఈ లోహం ధర పెరుగుతుంది. కానీ ఇప్పటివరకు చూస్తే, బ్యారెల్ చమురు ధర ఇప్పటికే 40 డాలర్ల వరకు పెరిగినా, బంగారం ధర ఆశించిన మేర పెరగలేదు. ఔన్సు (31.10 గ్రాముల) బంగారం ధర 5000 డాలర్లపైకి వెళ్లినా, గత గరిష్ఠస్థాయి అయిన 5500 డాలర్ల కంటే దూరంగానే ఉండిపోయింది. బుధవారం (ఈనెల 18న) అయితే అంతర్జాతీయంగా ఔన్సు ధర 110 డాలర్లు తగ్గింది. డాలర్‌కు గిరాకీ పెరగడం వల్ల, పెట్టుబడులు అటు మళ్లడమే ఈ పరిస్థితికి కారణమనే విశ్లేషణలు వస్తున్నాయి. అమెరికా ఫెడరల్ రిజర్వ్ తాజా సమీక్షలో వడ్డీరేట్లు తగ్గించకపోవచ్చనే అంచనాల వల్లే, పసిడి ధర తగ్గుతోందని చెబుతున్నారు. అయితే బ్యారెల్ చమురు ధర 200 డాలర్లకు చేరితే మాత్రం, బంగారం ప్రస్తుత స్థాయుల నుంచి 15 20% మేర పెరిగి ఔన్సు 5,4006,000 డాలర్లు పలకొచ్చని అంచనాలున్నాయి. వెండి ఔన్సు ధర ప్రస్తుతం 76 డాలర్ల వద్ద ఉన్నా, ఇది 110130 డాలర్లకు చేరొచ్చనీ పేర్కొంటున్నారు. ఇవన్నీ కూడా పలు అంతర్జాతీయ అంశాలపై ఆధారపడి ఉంటాయన్న సంగతి తెలిసిందే.

### దేశీయంగా డాలర్ భారం

అంతర్జాతీయంగా ధర ఎక్కువగానే తగ్గినా, దేశీయంగా డాలర్ భారం వల్ల, బంగారం, వెండి ధరల్లో పెద్దగా తగ్గుదల కనిపించడం లేదు. బుధవారం రాత్రి 11 గంటల సమయానికి 10 గ్రాముల మేలిమి బంగారం ధర రూ.1.58 లక్షలు, కిలో వెండి ధర రూ.2.53 లక్షల వద్ద ఉన్నాయి.

### గృహ రిఫ్రిజరేటర్ల విభాగంలోకి థామ్సన్

దిల్లీ: ఫ్రాన్స్‌కు చెందిన ఎలక్ట్రానిక్స్ దిగ్గజం థామ్సన్ గృహ రిఫ్రిజరేటర్ల విభాగంలోకి అడుగుపెట్టబోతున్నట్లు బుధవారం వెల్లడించింది. భారత గృహోపకరణాల విపణిలో దూకుడు ప్రదర్శించే ప్రణాళికతో రాబోతున్నామని తలిస్‌మాన్ బ్రాండ్స్ ఇంక్ సేల్స్ అకౌంట్ డైరెక్టర్ సెబాస్టీన్ క్రోమ్‌బెజ్ వెల్లడించారు. ఎల్‌ఈడీ టీవీ విభాగంలో ఫ్రాన్స్ తర్వాత అతి పెద్ద రెండో విపణిని మన దేశంలోనే సాధించిన థామ్సన్ ఇతర విభాగాల్లోకి ప్రవేశించేందుకు రంగం సిద్ధం చేసుకుంటోంది. గత కొన్నేళ్లుగా భారత్ అత్యంత వేగంగా వృద్ధి చెందుతున్న విపణిగా ఉందని సెబాస్టియన్ తెలిపారు. ప్రస్తుతం వాతావరణం అనుకూలంగా లేకపోయినా, భారత్‌లో థామ్సన్‌కు మంచి మార్కెట్ లభిస్తుందన్న పెద్ద నమ్మకంతో కొత్త విభాగాల్లోకి అడుగుపెడుతున్నామని వివరించారు. ప్రస్తుతం టీవీలు, వాషింగ్ మెషీన్లు, ఎయిర్ కూలర్లు, టోస్టర్స్, ఐరన్ బాక్స్‌లు, గీజర్లు తదితర గృహోపకరణాలను థామ్సన్ మన దేశంలో విక్రయిస్తోంది.



# నోరా ఫతేహి పాట వివాదం.. లోక్‌సభలో చర్చ



నోరా ఫతేహి నటించిన 'సర్కే చునార్ తేరీ సర్కే' పాట వివాదంలో చిక్కుకున్న సంగతి తెలిసిందే. దీనిపై లోక్‌సభలో బుధవారం చర్చ జరిగింది. సమాజ్‌వాదీ పార్టీ ఎంపీ ఆనంద్ భదౌరియా ఈ వివాదాస్పద పాట అంశాన్ని ప్రస్తావించారు. కేంద్రమంత్రి అశ్వినీ వైష్ణవ్ మాట్లాడుతూ.. భావ వ్యక్తీకరణ స్వేచ్ఛ హద్దుల్లోనే ఉండాలని, అందుకే పాటను బ్యాన్ చేసినట్లు తెలిపారు. ధ్రువ్ సర్జా హీరోగా తెరకెక్కిన 'కేడీ: ది డెవిల్' సినిమాలోని ఈ పాటలో సంజయ్ దత్, నోరా నటించారు. ఇటీవల సాంగ్ విడుదల కాగా సాహిత్యం, నృత్యంపై విమర్శలు వచ్చాయి. ఆలిండియా సినీ వర్కర్స్ అసోసియేషన్.. కేంద్ర సమాచార, ప్రసార మంత్రిత్వశాఖకు ఫిర్యాదు చేయగా తగిన చర్యలు తీసుకుంది. ఈ వివాదంపై ఇప్పటికే బాలీవుడ్ గేయ రచయిత రకీబ్ ఆలం స్పందించారు. దర్శకుడు ప్రేమ్ కన్నడలో రాసిన పాటను చిత్ర బృందం విజ్ఞప్తి మేరకు అనువదించానని అన్నారు. వ్యతిరేకత ఎదురైన నేపథ్యంలో కొత్త వెర్షన్ రాయమని కోరినట్లు తెలిపారు. ఏప్రిల్ 30న విడుదలకు ఈ సినిమా సిద్ధమవుతోంది.

## 'ధురంధర్ 2' తెలుగు అభిమానులకు బ్యాడ్‌న్యూస్



'ధురంధర్ 2' కోసం ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న తెలుగు అభిమానులకు బ్యాడ్ న్యూస్. మార్చి 19న మూవీ విడుదల నేపథ్యంలో ఒకరోజు ముందుగానే ప్రీమియర్స్ ప్రదర్శిస్తున్న సంగతి తెలిసిందే. హిందీతో పాటు దక్షిణాది భాషల్లో ఈ మూవీని విడుదల చేస్తున్నారు. 'ధురంధర్: ది రివెంజ్' ప్రీమియర్‌ను తెలుగులో చూడాలని టికెట్ బుక్ చేసుకున్న అభిమానులకు నిరాశ ఎదురైంది. పలు మల్టీప్లెక్స్‌లు, సింగిల్ స్క్రీన్ థియేటర్లు ప్రీమియర్స్‌ను క్యాన్సిల్ చేశాయి. టికెట్లు బుక్ చేసుకున్న వారికి అమౌంట్ రిఫండ్ కూడా చేశాయి. సాంకేతిక సమస్యలతో తెలుగు వెర్షన్ ప్రీమియర్‌ను రద్దు చేసినట్లు తెలుస్తోంది. గురువారం యథాతథంగా హిందీతో పాటు, తెలుగులోనూ ప్రదర్శించనున్నట్లు సమాచారం. మరోవైపు దర్శకుడు ఆదిత్య ధర్ అభిమానులతో ఆసక్తికర విషయం పంచుకున్నారు. సినిమా చివరివరకూ చూడమని సూచించారు. ఎండ్ క్రెడిట్స్ పడేవరకూ థియేటర్‌లోనే ఉండాలన్నారు. ఈ పోస్ట్‌తో మరో అంశం తెర పైకి వచ్చింది. 'పార్ట్ 3' ఉంటుందంటూ సినీ ప్రియులు పోస్టులు పెడుతున్నారు.

## అందుకే 'ఉస్తాద్ భగత్ సింగ్' టికెట్ ధరలు పెంచలేదు.. క్లారిటీ ఇచ్చిన నిర్మాత



'ఉస్తాద్ భగత్ సింగ్' కోసం పవన్‌కల్యాణ్ ఒక్కోసారి 15గంటలకు పైగా కష్టపడ్డారని నిర్మాత నవీన్ యెర్నేని తెలిపారు. మైత్రీ మూవీ మేకర్స్ పతాకంపై వై.రవిశంకర్‌తో కలిసి ఆయన నిర్మించిన చిత్రమిది. హరీశ్ శంకర్ దర్శకత్వంలో రూపొందిన ఈ యాక్షన్ ఎంటర్‌టైనర్ ఉగాది కానుకగా మార్చి 19న ప్రేక్షకుల ముందుకు రానుంది. శ్రీలీల, రాశీఖన్నా కథానాయికలు. ఈ సందర్భంగా చిత్ర బృందం విలేకరుల సమావేశం నిర్వహించింది.

**'ధురంధర్ 2' మీకు కాంపిటీషన్ అవుతుందా?**

***హరీశ్ శంకర్:*** ఆదిత్య ధర్' గొప్ప దర్శకుడు. 'ధురంధర్' రాక మునుపే ఆయన అభిమానిని. ఆ సినిమా జానర్ వేరు.. మనది వేరు. ఆ చిత్రానికి 'ఉస్తాద్ భగత్ సింగ్'కు కాంపిటీషన్ కాదు.

నిర్మాత నవీన్: 'ధురంధర్' నేను మూడు సార్లు చూశాను. అది హిందీ సినిమా, ఇది తెలుగుది. పైగా పవన్‌కు మించిన హీరో ఇక్కడ మరొకరు ఉండరు కదా!

**అభిమానులకు ఈ సినిమా గురించి ఏం చెబుతారు?**

***హరీశ్ శంకర్:*** ఈ సినిమాలో పవన్ నవ్వు దగ్గర నుంచి ఆయన స్వాగ్ వరకూ ప్రతిదీ అభిమానులను ఆకట్టుకుంటుంది. పవన్‌ను ఇలా స్క్రీన్‌పై చూసి చాలా రోజులైంది. ఈ మాటలు దర్శకుడిగా చెప్పడం లేదు. అభిమానిగా చెబుతున్నా. ఇది నేను ఫ్యాన్స్‌కు ఇచ్చే భరోసా.

**ఈ సినిమా టికెట్ ధరలు ఎందుకు పెంచలేదు?**

***నవీన్:*** మాకు పెద్దలతో చర్చించేంత సమయం లేదు. మామూలు టికెట్ రేట్లకు ఎంత వసూళ్లు అవుతాయో అన్నది చూద్దామని ఆ ప్రయత్నం చేయలేదు.

**ఈ సినిమాకు పవన్ కల్యాణ్ రెమ్యునరేషన్ తగ్గించుకున్నారా?**

***నవీన్:*** పవన్ ఈ సినిమా కోసం చాలా సపోర్ట్ చేశారు. మినిమం అడ్వాన్స్ తీసుకున్నారంతే. రాజకీయాల్లో బిజీగా ఉండడంతో 3 నెలలు మాత్రమే డేట్స్ ఇవ్వగలను అన్నారు. ఒక్కోసారి 15 గంటలు కూడా కష్టపడ్డారు.

**తమన్, దేవిశ్రీ ప్రసాద్‌కు మధ్య ఇష్యూస్ ఉండడం వల్ల ప్రీరిలీజ్‌కు రాలేదని టాక్ వినిపిస్తోంది. నిజమేనా?**

***హరీశ్ శంకర్:*** అలాంటివి ఏవీ లేవు. వాళ్లు అదే రోజు మరో అవార్డుల వేడుకలకు వెళ్లాల్సి వచ్చింది.

**ఈ సినిమా చూశాక పవన్ రియాక్షన్ ఏంటి?**

***హరీశ్ శంకర్:*** ఇంత పెద్ద సినిమా అలవోకగా తీశావు. నవ్వుతూ నవ్విస్తూ తెరకెక్కించావు. ఇది ప్రశంసించాల్సిన విషయం అన్నారు.

## మరోసారి విజయ్ సేతుపతి, మణిరత్నం



కోలీవుడ్‌లో మరో సెన్సేషన్ కాంబినేషన్ సెట్ అయింది. హీరో విజయ్ సేతుపతి అప్‌కమింగ్ ప్రాజెక్ట్ గురించి తాజాగా ఓ ఇంటర్వ్యూలో ఇంట్రెస్టింగ్ విషయాన్ని పంచుకున్నాడు. లెజెండరీ డైరెక్టర్ మణిరత్నంతో కలిసి ఒక లవ్ స్టోరీ చేయబోతున్నట్టు కన్ఫర్మ్ చేశాడు. ఈ న్యూస్ విజయ్ సేతుపతి ఫ్యాన్స్‌కే కాకుండా సినిమా ప్రియులకూ సర్ప్రైజ్‌గా మారింది. మణిరత్నంతో విజయ్ సేతుపతి గతంలో 'నవాబ్' సినిమా చేశాడు. తాజాగా తన అప్‌కమింగ్ ప్రాజెక్టుపై మరికొన్ని ఆసక్తికర విషయాలు కూడా వెల్లడించాడు. దాని ప్రకారం మణిరత్నం ఈ ప్రాజెక్ట్‌కు యంగ్ మ్యూజిక్ సెన్సేషన్ సాయి అభ్యంకర్‌ను తీసుకోబోతున్నాడట. మూడు దశాబ్దాలుగా మణిరత్నం ఎక్కువగా ఎ.ఆర్. రెహ్మాన్‌తోనే కలసి పని చేశాడు. ఇప్పుడు సంగీతంలో సరికొత్త ప్రయోగాలు చేయాలని ఆయన ఆసక్తి చూపిస్తున్నట్టు తెలుస్తోంది. అయితే ఈ ప్రాజెక్ట్‌లో అభ్యంకర్ పేరు వినిపిస్తున్నప్పటికి రెహమాన్ నే ఫైనల్ చేసినట్లు టాక్ నడుస్తోంది. త్వరలోనే అధికార ప్రకటన వచ్చే ఛాన్స్ కనిపిస్తోంది. డాన్సింగ్ సెన్సేషన్ సాయి పల్లవి ఈ రొమాంటిక్ డ్రామాలో హీరోయిన్‌గా నటించనుంది. ఈ చిత్రాన్ని మణిరత్నం సొంత బ్యానర్ మద్రాస్ టాకీస్, లైకా ప్రొడక్షన్స్ సంయుక్తంగా నిర్మించనున్నాయి. షూటింగ్ సమ్మర్‌లో మొదలు పెట్టాలని భావిస్తున్నారు. ఈ సూపర్ కాంబినేషన్ ఎలా ఉంటుందో అని సినిమా ప్రియులు ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు.

## కొన్నిసార్లు 24 గంటలూ పనిచేశాను



"ఉస్తాద్ భగత్ సింగ్' సినిమా 'గబ్బర్ సింగ్'లాగే అందర్నీ అలరించేలా ఉంటుంది'' అంది నటి రాశీ ఖన్నా. పవన్ కల్యాణ్‌తో కలిసి పని చేయాలన్న తన కల ఈ చిత్రంతో నెరవేరిందని సంతోషం వ్యక్తం చేసింది. పవన్ కల్యాణ్ టైటిల్ పాత్రలో నటించిన ఈ సినిమాని హరీశ్ శంకర్ తెరకెక్కించిన సంగతి తెలిసిందే. దీంట్లో శ్రీలీలతో పాటు రాశి కూడా ఓ కథానాయికగా నటించింది. ఈ సినిమా ఈ నెల 19న థియేటర్లలోకి రానుంది. ఈ నేపథ్యంలోనే సోమవారం హైదరాబాద్‌లో విలేకర్లతో ముచ్చటించింది రాశి ఖన్నా. "నా సినీ ప్రయాణంలో తొలిసారి కథ వినకుండానే ఓకే చెప్పిన సినిమా ఇది. పవన్ కల్యాణ్ చిత్రం అనగానే మరో ఆలోచన లేకుండా ఎంతో ఉత్సాహంగా వెంటనే చేస్తానని చెప్పా. ఎందుకంటే నేను నా తొలి చిత్రం చేస్తున్నప్పటి నుంచే ఆయన స్టార్‌డమ్, పవనిజం గురించి విన్నా. అప్పుడే ఆయనతో కలిసి ఒక్క సినిమా అయినా చేయాలని అనుకున్నా. ఇది 'ఉస్తాద్..'తో నెరవేరింది. నేను ఈ చిత్రం ఒప్పుకున్నప్పుడే 'పవన్ షెడ్యూల్స్ ఎలా ఉంటాయో చెప్పలేమ'ని దర్శకుడు హరీశ్ నాకు ముందే చెప్పారు. దానికి తగ్గట్లుగానే నా డేట్స్ సర్దుబాటు చేసుకుంటానని చెప్పా. ఈ చిత్రం కోసం కొన్నిసార్లు పగలు రాత్రి తేడా లేకుండా 24గంటల షిఫ్టులు కూడా పని చేశాను. అదొక మర్చిపోలేని అనుభవం''. "ఇదొక మంచి కుటుంబ కథా చిత్రం. అందర్నీ అలరించేలా ఉంటుంది. ఈ సినిమాతో వింటేజ్ పవన్ కల్యాణ్‌ని చూస్తారు. నేనిందులో శ్లోక అనే మోడ్రన్ అమ్మాయిగా కనిపిస్తా. ఈ కథలో నా పాత్రతో పాటు ప్రతి పాత్రకీ మంచి ప్రాధాన్యత ఉంటుంది. నాకిందులో ఓ మంచి మాస్ పాట కూడా ఉంది''.



## ప్రత్యక్ష రాజకీయాల్లోకి ఎప్పుడొస్తారు?

### ..నారా రోహిత్ సమాధానమిదే

**ప్రత్యక్ష రాజకీయాల్లోకి రావడంపై సినీ నటుడు నారా రోహిత్ స్పందించారు. తన తండ్రి నారా రామ్మూర్తి నాయుడు 74వ జయంతిని ఆయన స్వగ్రామం తిరుపతి జిల్లా చంద్రగిరి మండలం నారావారిపల్లెలో ఘనంగా నిర్వహించారు. నారా రామ్మూర్తి నాయుడు స్మృతివనంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి రోహిత్ సహా ఇతర కుటుంబసభ్యులు హాజరై ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా నారా రోహిత్ మాట్లాడారు. ప్రజలు తమ తండ్రి జ్ఞాపకాలను తమతో పంచుకోవడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. కార్యక్రమానికి హాజరైన అభిమానులు, శ్రేయోభిలాషులకు కృతజ్ఞతలు తెలిపారు.**

## అద్దీ హ్యాపీరాజ్ లెక్క



జి.వి.ప్రకాశ్‌కుమార్, శ్రీగౌరీప్రియ జంటగా తెరకెక్కిన చిత్రం 'హ్యాపీరాజ్'. మరియారాజా ఎలాంచెజియన్ దర్శకత్వం వహిస్తున్నారు. జైవర్ధ నిర్మాత. మైత్రీ మూవీ డిస్ట్రిబ్యూటర్స్ సంస్థ నుంచి ఈ నెల 27న ఈ చిత్రం తెలుగులో విడుదల కానుంది. ఈ సందర్భంగా ఇందులోని 'అద్దిరా లెక్క...' అంటూ సాగే పాటని విడుదల చేశారు. జస్టిన్ ప్రభాకరన్ స్వరకల్పనలోని ఈ పాటని రెహ్మాన్ రచించగా, గోవింద్ ప్రసాద్ ఆలపించారు. "విభిన్నమైన కథతో రూపొందిన చిత్రమిది. అద్దిరా లెక్క... పాటకు జీవీ ప్రకాశ్ డాన్స్, ఆయన కనిపించే విధానం ప్రత్యేకం. విడుదలైన వెంటనే పాటకి మంచి స్పందన లభించింద''ని సినీ వర్గాలు చెప్పాయి.

## భావితరాలకి ప్రేరణగా... వనజీవి రామయ్య



**"తన జీవితంలో దాదాపు 70 ఏళ్లపాటు మొక్కలు నాటిన వనజీవి రామయ్యని రేపటి సమాజం మరిచిపోకూడదు. ఆయన జీవితం భావితరాలకి ప్రేరణగా నిలవాలనే 'వనజీవి రామయ్య' చిత్రాన్ని తెరకెక్కించాం" అన్నారు వేముగంటి. ఆయన తెరకెక్కించిన చిత్రం 'వనజీవి రామయ్య'. బ్రహ్మాజీ, నాగరాణి ప్రధాన పాత్రలు పోషించారు. నిడిగొండ నరేశ్‌కుమార్ ప్రజాపతి, బుసం రవీంద్రనాథ్, లింగంపల్లి చంద్రశేఖర్ నిర్మాతలు. ఈ చిత్రం ఉత్తమ లఘు చిత్రం విభాగంలో ప్రతిష్ఠాత్మక గద్దర్ పురస్కారానికి ఎంపికైంది. ఈ సందర్భంగా చిత్రబృందం మంగళవారం హైదరాబాద్‌లో ప్రత్యేక ప్రదర్శనని నిర్వహించారు. రాజకీయ ప్రముఖులు ప్రొఫెసర్ కోదండరాం, వెన్నెల, వి.ప్రకాశ్, తన్నీరు బాబురావు, నాగమహేశ్‌తోపాటు, సినీ ప్రముఖులు తనికెళ్ల భరణి, తమ్మారెడ్డి భరద్వాజ తదితరులు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు.**

## టామీ ఎదుర్కొన్న సవాళ్లేంటి?

రెండవ ప్రపంచ యుద్ధ సమయంలో జరిగిన సంఘటనల ఆధారంగా హిస్టారికల్ క్రైమ్ చిత్రంగా రూపొందింది 'పీకీ బ్లైండర్స్: ది ఇమ్మోర్టల్ మ్యాన్'. దేశంలో గందరగోళ పరిస్థితులను పరిష్కరించడానికి అక్కడి అధికారులు టామీ అనే వ్యక్తిని నియమిస్తారు. అతడు తన కుటుంబంతోపాటు దేశం కూడా ప్రమాదంలో ఉందని తెలుసుకున్నాక ఎదుర్కొన్న సవాళ్ల నేపథ్యంలో రూపొందిందీ సినిమా. శత్రువుల్ని ఎదిరించి ఎలా ముందుకు సాగాడో అనే కథాంశంతో దీనిని టామ్ హర్పర్ తెరకెక్కించారు. శుక్రవారం నుంచి నెట్‌ఫ్లిక్స్ వేదికగా వీక్షకులకు అందుబాటులోకి రానుంది.

## టాప్5 బ్యాటర్లలో భారత్ నుంచి ముగ్గురు..

## ముందుకొచ్చిన బుమ్రా




అత్యుత్తమ ఆటగాళ్ల ర్యాంకులను తాజాగా ఐసీసీ ప్రకటించింది. టీ20 ప్రపంచ కప్ తర్వాత భారత్‌కు చెందిన ఆటగాళ్లు ఏ మ్యాచ్‌లోనూ ఆడలేదు. అయితే, టీ20 బౌలింగ్ విభాగంలో స్టార్ పేసర్ జస్‌ప్రీత్ బుమ్రా ఒక ర్యాంకును మెరుగుపర్చుకుని టాప్5లోకి వచ్చాడు. రషీద్ ఖాన్ (753), వరుణ్ చక్రవర్తి (740) తొలి రెండు స్థానాల్లో నిలిచారు. బుమ్రా (702) ఐదో ర్యాంక్‌కు చేరాడు. ఇక బ్యాటింగ్ జాబితాలో ఎలాంటి మార్పులు లేవు. భారత ఎడమచేతివాటం బ్యాటర్లు అభిషేక్ శర్మ (875), ఇషాన్ కిషన్ (871) తొలి రెండు స్థానాలను పదిలం చేసుకున్నారు. తిలక్ వర్మ (742) ఒక్క ర్యాంకు ముందుకొచ్చి ఆరో స్థానానికి చేరాడు. పొట్టికప్ 'ప్లేయర్ ఆఫ్ ది సిరీస్' సంజు శాంసన్ (636) కూడా ఒక్క స్థానం మెరుగుపర్చుకుని 21వ ర్యాంకులో ఉన్నాడు. ఆల్‌రౌండర్ల జాబితాలో జింబాబ్వే ఆటగాడు సికందర్ రజా, భారత స్టార్ ప్లేయర్ హార్దిక్ పాండ్యవే తొలి రెండు స్థానాలు. ఈ వారం రోజుల వ్యవధిలో దక్షిణాఫ్రికా, న్యూజిలాండ్ జట్లు మాత్రమే టీ20లను ఆడాయి.

## జీవితాంతం ఆడలేం కదా..: పీవీ సింధు



డాకారులు చదువుకోవాల్సిన ఆవశ్యకతను ఒలింపిక్ పతకాల విజేత, తెలుగు తేజం పీవీ సింధు నొక్కిచెప్పారు. కేవలం స్పోర్ట్స్ మీదనే కాకుండా.. చదువుపైనా దృష్టిపెట్టాలని సూచించారు. ఒక్క గాయం కెరీర్‌నే ముగించే పరిస్థితికి తీసుకొస్తుందని వ్యాఖ్యానించారు. అందుకే, అథ్లెట్లకూ విద్యాభ్యాసం అత్యంత ముఖ్యమని వెల్లడించారు. తన కెరీర్‌లోనూ ఎన్నోసార్లు ఆటుపోట్లు ఎదుర్కొన్నట్లు తెలిపారు. గురుగ్రామ్‌లోని ఓ పాఠశాల కార్యక్రమానికి ఆమె హాజరయ్యారు. ఈ సందర్భంగా చదువు, క్రీడలకు సంబంధించి ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు.

"నేను కొన్నేళ్లుగా ఆడుతూనే ఉన్నా. అయితే, ఏదొక సమయంలో రిటైర్‌మెంట్ అవ్వాల్సిందే కదా.. ఇది ఎవరూ కాదనలేని వాస్తవం. మనం 45 లేదా 50 ఏళ్లు వచ్చాక స్పోర్ట్స్ ఆడటం కష్టం. కానీ, చదువు మాత్రం మన జీవితాంతం తోడు ఉంటుంది. ప్రతి ఒక్కరూ బంగారు స్పూన్‌తో జన్మించలేరు. ఎందులోనైనా సరే కష్టపడాల్సిందే. అది చదువైనా.. క్రీడలైనా సరే అకుంఠిత దీక్షతో శ్రమించాలి. రెండింటికీ సమప్రాధాన్యం ఇవ్వాలి. నేను ఎంబీఏ పూర్తి చేశా. అయితే, ఓ వైపు స్పోర్ట్స్‌లో ఉంటూ చదువు కొనసాగించడం తేలికైన విషయం కాదని తెలుసు. ఉదయాన్నే ప్రాక్టీస్‌కు వెళ్లడం.. వచ్చాక చదువుకోవడం.. మళ్లీ సాయంత్రం సాధనకు వెళ్లడం కష్టమే. ఇక్కడే మనం ఒకటి గుర్తు పెట్టుకోవాలి. జీవితాంతం క్రీడల్లో కొనసాగలేం.. చదువు ఉంటే మాత్రం నిబ్బరంగా ఉండొచ్చు. స్పోర్ట్స్ ముఖ్యమే కానీ, చదువును పూర్తిగా పక్కన పెట్టేసి ప్రయత్నించకూడదు" అని సింధు తెలిపారు.

**ఒక్కసారి పెద్ద గాయమైతే..**

"క్రీడల్లో ఎప్పుడు ఏం జరుగుతుందో ఎవరికీ తెలియదు. నిరంతరం రిస్క్‌తో కూడుకున్నదే. అలాగని వద్దని చెప్పను. ఆటలను కెరీర్‌గా ఎంచుకున్నప్పటికీ చదువును నిర్లక్ష్యం చేయొద్దు. ఆడేటప్పుడు ఒక్క పెద్ద గాయమైతే.. కోలుకుని రావడం కష్టం. ఒక్కోసారి కెరీర్ ముగిసే అవకాశమూ లేకపోలేదు. ప్రమాదాలు చెప్పి రావు కదా. నేను 2016 ఒలింపిక్స్‌కు ముందు తీవ్రంగా గాయపడ్డా. కొన్నిరోజులపాటు నొప్పితోనే ఆడా. వైద్యుల వద్దకు వెళ్తే వారు ఏం చెబుతారనే భయం వెంటాడేది. మళ్లీ జీవితంలో ఆడతానా? లేదా? అనే అనుమానాలు వచ్చాయి. వైద్య చికిత్స తీసుకున్నా. మళ్లీ కోలుకుని ఒలింపిక్స్ బరిలోకి దిగా" అని నాటి సంగతులను గుర్తు చేసుకున్నారు.

## భారత్‌కు కఠిన డ్రా



దిల్లీ: ప్రతిష్ఠాత్మక థామస్ అండ్ ఉబర్ కప్ బ్యాడ్మింటన్ టోర్నీలో భారత జట్లకు కఠిన డ్రా పడింది. థామస్ కప్‌లో పురుషులు ఉబర్ కప్‌లో మహిళలు డిఫెండింగ్ ఛాంపియన్ చైనా జట్లు ఉన్న గ్రూప్‌లోనే ఉన్నారు. ఏప్రిల్ 24 నుంచి మే 3 వరకు డెన్మార్క్‌లో జరిగే టోర్నీకి సంబంధించి డ్రాను నిర్వాహకులు విడుదల చేశారు. భారత జట్లు రెంటికీ టోర్నీలో ఎనిమిదో సీడింగ్ లభించింది. 2022లో థామస్ కప్ ఛాంపియన్‌గా నిలిచిన భారత జట్టుతో పాటు గ్రూప్‌ఎలో చైనా, కెనడా, ఆస్ట్రేలియా ఉన్నాయి. చైనాను ఓడించడం కష్టమే అయినప్పటికీ.. కెనడా, ఆస్ట్రేలియాలపై నెగ్గి గ్రూప్ నుంచి క్వార్టర్స్ చేరడానికి మెరుగైన అవకాశాలే ఉన్నాయి. సింగిల్స్‌లో లక్ష్యసేన్.. డబుల్స్‌లో సాత్విక్ సాయిరాజు, చిరాగ్ శెట్టిలపై భారీ అంచనాలే ఉన్నాయి. కానీ మహిళల జట్టుకు మాత్రం అంత తేలిక కాదు. ఉబెర్ కప్‌లో ఇండియాతో పాటు చైనా, డెన్మార్క్, ఉక్రెయిన్ గ్రూప్‌బిలో చోటు దక్కించుకున్నాయి. చైనానే కాక డెన్మార్క్ బలమైన జట్టు కావడంతో క్వార్టర్స్ చేరడానికి కష్టపడాల్సిందే. స్టార్ షట్లర్ పి.వి.సింధు జట్టును ముందుండి నడిపించాల్సి ఉంది. ప్రతి గ్రూప్ నుంచి టాప్2 జట్లు నాకౌట్‌కు చేరతాయి.

# కోహ్లీపైనే అందరి దృష్టి .. ఆర్‌సీబీ రె'ఢీ'




ఒకటి కాదు రెండు కాదు పదిహేడు సీజన్ల పాటు రాయల్ చాలెంజర్స్ బెంగళూరు (ఆర్‌సీబీ) ఐపీఎల్ టైటిల్ వేటలో విఫలమైంది. ఎన్నో ఆశలు, మరెన్నో అంచనాలతో బరిలోకి దిగడం చివరకు ఖాళీ చేతులతో వెనుదిరగడం జట్టుకు అలవాటులా కనిపించింది. మూడుసార్లు ఫైనల్ చేరినా రన్నరప్‌తో సంతృప్తి చెందాల్సి వచ్చింది. కానీ ఆర్‌సీబీ అభిమానుల కోరిక ఎట్టకేలకు గత సీజన్‌లో తీరింది. ఎట్టకేలకు 18వ ప్రయత్నంలో బెంగళూరు ఐపీఎల్ విజేతగా నిలిచింది. విజయోత్సవ వేడుకలో అపశ్రుతితో ఈ గెలుపు సంబరాలు కాస్త తగ్గినా ఇప్పుడు అంతా సర్దుకుంది. తమ సొంత మైదానంలో మళ్లీ మ్యాచ్‌లకు ఆర్‌సీబీ సిద్ధమైంది. గత ఏడాదితో పోలిస్తే పెద్దగా మార్పులు లేకుండా దాదాపు అదే బృందాన్ని కొనసాగించిన టీమ్ మళ్లీ టైటిల్ కొడుతుందా లేదా వేచి చూడాలి!

తొలి టైటిల్ కోసం ఎంతగానో ఎదురు చూసిన తర్వాత ఆర్‌సీబీ టీమ్‌లో ఒక కొత్త ఉత్సాహం కనిపిస్తోంది. ఒకప్పుడు కోహ్లీ లేదా గేల్ లేదా డివిలియర్స్‌ల వ్యక్తిగత ప్రదర్శనలపైనే ఆధారపడిన జట్టు 2025 సీజన్‌లో సమష్టి తత్వాన్ని నమ్ముకుంది. అదే మంచి ఫలితాలను ఇచ్చింది. కోహ్లీ ఎప్పటిలాగే తనదైన శైలిలో 657 పరుగులతో టాప్ స్కోరర్‌గా నిలిచాడు. అయితే కోహ్లీ ప్రదర్శనకు మించి ఇతర ఎన్నో అంశాలు జట్టును నడిపించాయి. జట్టు కష్టాల్లో నిలిచిన ప్రతీ మ్యాచ్‌లో ఒక్కో ఆటగాడు హీరోగా నిలిచాడు.

కృనాల్ పాండ్యా, రొమారియో షెఫర్డ్, టిమ్ డేవిడ్, హాజల్‌వుడ్, భువనేశ్వర్... ఇలా అందరూ తమ పాత్ర పోషించారు. కొత్త కెప్టెన్ రజత్ పాటీదార్ ప్రశాంతంగా జట్టును నడిపించిన తీరు కూడా ప్రశంసనీయం. కెప్టెన్ హోదా లేకపోయినా కోహ్లీ టీమ్‌లో నింపే స్ఫూర్తి గురించి ప్రత్యేకంగా చెప్పాల్సిన పని లేదు. ఈసారి సీజన్‌లో కూడా ఆర్‌సీబీ నుంచి అభిమానులు అదే ఆశిస్తున్నారు. సరిగ్గా చెప్పాలంటే ఇతర జట్లతో పోలిస్తే వేలం సమయంలో ఆర్‌సీబీకి పెద్ద సమస్య లేకపోయింది. వేలంలో 8 మంది ఆటగాళ్లను ఎంచుకోగా... వీరిలో ఐదుగురు భారత్‌కు ఆడని 'అన్‌క్యాప్డ్' ఆటగాళ్లే. మిగతా ముగ్గురు కచ్చితంగా తుది జట్టులో ఉండే ఆటగాళ్లు కాదు. ముందు జాగ్రత్తగా వేలంలో జాకబ్ డఫీ, జోర్డాన్ కాక్స్, వెంకటేశ్ అయ్యర్‌లను తీసుకుంది. అయితే ఎవరూ ఉన్నా, లేకున్నా ఎప్పటిలాగే టీమ్‌లో జోష్ నింపేందుకు కోహ్లీ ఉండటమే అది పెద్ద బలం.

**పదునైన బ్యాటింగ్...**

2025 ఫైనల్లో ఆడిన తుది జట్టును ఈసారి మొదటి మ్యాచ్‌లో ఆడటం కోసం చూసుకుంటే ఎనిమిది మంది కచ్చితంగా జట్టులో ఉంటారు. ఆర్‌సీబీ విడుదల చేసిన లివింగ్‌స్టోన్‌కు బదులుగా ఈసారి అంతకంటే విధ్వంసకర బ్యాటర్ జాకబ్ బెతెల్‌కు తుది జట్టులో చోటు ఖాయం. గత ఏడాది అతను 2 మ్యాచ్‌ల్లో ఆడగా, అందులో ఒక అర్ధసెంచరీ ఉంది. ఇటీవలి టి20 వరల్డ్ కప్‌లో భారత్‌పై చెలరేగి బెతెల్ సాధించిన సెంచరీని చూస్తే ఆర్‌సీబీ బలం మరింత పెరిగినట్లే. మూడో స్థానంలో ఆడిన మయాంక్ అగర్వాల్ జట్టుకు దూరమయ్యాడు. ఈ స్థానం కోసం ఇద్దరు భారత బ్యాటర్లు పడిక్కల్, వెంకటేశ్ అయ్యర్ మధ్య పోటీ ఉంది. అయితే గతంలో ఇదే జట్టుతో ఆడిన అనుభవం, ఇటీవలి ఫామ్, లోకల్ ముద్ర కారణంగా పడిక్కల్‌కే ఎక్కువ చాన్స్ ఉంది. కోహ్లీ, సాల్ట్‌లతో తిరుగులేని ఓపెనింగ్ జట్టు సొంతం. వీరిద్దరు ఇచ్చే ఆరంభాలే జట్టు విజయాలకు పునాది అవుతాయి. మిడిలార్డర్‌లో పాటీదార్, డేవిడ్, జితేశ్ శర్మలు ఇన్నింగ్స్‌ను ధాటిగా నడిపించగల సమర్థులు. ఈ బృందం విఫలమైనా ఆల్‌రౌండర్లు కృనాల్ పాండ్యా, షెఫర్డ్ బ్యాటింగ్‌తో ఆదుకోగలరు. గత సీజన్‌లో ఇది బాగా కనిపించింది. ఈ నేపథ్యంలో చిన్నస్వామి మైదానంలో భారీ స్కోర్లు సాధిస్తే జట్టుకు తిరుగుండదు.

**భువీ, దయాళ్‌లపై భారం...**

బౌలింగ్‌కు సంబంధించి ఆర్‌సీబీని ఒకే ఒక సమస్య వెంటాడుతోంది. అదే స్టార్ పేసర్ హాజల్‌వుడ్ లేకపోవడం. గత సీజన్‌లో 22 వికెట్లతో జట్టుకు విజయం అందించడంలో అతను కీలకపాత్ర పోషించాడు. హాజల్‌వుడ్ ఎప్పుడు అందుబాటులోకి వస్తాడో తెలీని స్థితిలో ప్రత్యామ్నాయంపై జట్టు దృష్టి పెట్టింది. ఇద్దరు భారత పేసర్లు భువనేశ్వర్, యశ్ దయాళ్ కీలకం కానుండగా, ఈసారి పేస్ విషయంలో వీరిపై అదనపు భారం ఉంది. హాజల్‌వుడ్‌కు బదులుగా డఫీ, తుషారాలలో ఒకరిని ఆడిస్తారా లేక భారత పేసర్ రసిఖ్ దార్‌కు అవకాశం ఇస్తారా చూడాలి. స్పిన్‌లో మరోసారి సుయశ్ శర్మ ప్రధాన అస్త్రం కాగా, కృనాల్ పాండ్యా లెఫ్టార్మ్ స్పిన్‌తో ప్రత్యర్థిని కట్టడి చేయగలడు. షెఫర్డ్ కూడా బౌలింగ్‌లో జట్టు కోటా పూర్తి చేయగలడు.

ఐపీఎల్‌లో ఆర్‌సీబీ గణాంకాలు

ఆడిన మ్యాచ్‌లు 271

గెలిచినవి 134 ఓడినవి 133 రద్దు 4

అత్యుత్తమ ప్రదర్శన: విజేత (2025), రన్నరప్ (2009, 2011, 2016)


2026 జట్టు వివరాలు: రజత్ పాటీదార్ (కెప్టెన్ ), పడిక్కల్, కోహ్లీ, సాల్ట్, జితేశ్, కాక్స్, కృనాల్, స్వప్నిల్, డేవిడ్, షెఫర్డ్, బెతెల్, వెంకటేశ్ అయ్యర్, సాత్విక్, మంగేశ్, విక్కీ ఒస్వాల్, విహాన్ మల్హోత్రా, కనిష్క్ చౌహాన్, హాజల్‌వుడ్, రసిఖ్ దార్, సుయాశ్, భువనేశ్వర్, నువాన్ తుషారా, అభినందన్ సింగ్, డఫీ, యశ్ దయాళ్.

# ధోని జెర్సీ నంబర్ మారనుందా?

టీమిండియా మాజీ క్రికెటర్ ఎంఎస్ ధోని ఐపీఎల్ 2026 సీజన్‌లో తన జెర్సీ నంబర్ మార్చుకోనున్నట్లుగా వార్తలు వస్తున్నాయి. ధోని జెర్సీ నంబర్ ఎంత అని చిన్న పిల్లాడిని అడిగినా టక్కున ఏడు అని చెప్పేస్తాడు. అంతలా పాతుకుపోయింది ధోని జెర్సీ నంబర్. రెండు దశాబ్దాల పాటు భారత క్రికెట్‌కు ఆడిన ధోని ఏడు నెంబర్ జెర్సీతోనే బరిలోకి దిగాడు. అంతర్జాతీయ క్రికెట్‌కు రిటైర్మెంట్ ప్రకటించిన తర్వాత ఐపీఎల్‌లోనూ సీఎస్‌కే తరపున అదే జెర్సీ నెంబర్‌తో బరిలోకి దిగుతున్నాడు. అయితే తాజాగా ధోనినే స్వయంగా తన ఫేస్‌బుక్ ఖాతా వేదికగా తాను ధరించబోయే ఎనిమిదో నెంబర్ జెర్సీని పంచుకున్నాడు. 'కొన్ని నంబర్లు మనతో పాటే ఉండిపోతాయి. అందులో ఏడు అనేది ఒకటి. కానీ ఇవాళ నేను 8కి స్విచ్ అవుతున్నా. ఎందుకనేది మీకు త్వరలోనే తెలుస్తోంది' అంటూ ధోని ఒక క్యాప్షన్ జత చేశాడు. ఇది చూసిన ధోని అభిమానులు మాత్రం 'మా ధోని ఎప్పుడు ఏడో నంబర్ జెర్సీకే కట్టుబడి ఉండాలి. అది మాకు ఎన్నో జ్ఞాపకాలు మిగిల్చింది' అంటూ పేర్కొన్నారు. మరికొందరు మాత్రం అది కేవలం అడ్వర్టైజ్‌మెంట్ కోసం ధోని చేసిన వీడియో అని తెలిపారు. నిజానికి ఎంఎస్ ధోనికి నంబర్ 7తో చాలా ప్రత్యేక అనుబంధం ఉంది. ధోనికి ఆ నంబర్ ఒక ఎమోషన్ కూడా. ధోని పుట్టిన తేదీ జూలై 7 (07/07). అందుకే కెరీర్ ఆరంభం నుంచి ధోని అదే నంబర్‌ను వాడుతున్నాడు. భారత క్రికెట్‌కు ధోనీ చేసిన సేవలకు గుర్తింపుగా బీసీసీఐ ఇప్పటికే అంతర్జాతీయ క్రికెట్‌లో నంబర్ 7 జెర్సీకి రిటైర్మెంట్ కూడా ప్రకటించి అతని జెర్సీని బీసీసీఐ మ్యూజియంలో ఉంచింది. ఇలాంటి తరుణంలో ధోని తనకు అచ్చొచ్చిన నంబర్‌ను ఐపీఎల్‌లో మార్చుకోవడం సాధ్యమేనా అనే సందేహాలు కూడా వ్యక్తమవుతున్నాయి.




## పురుషుల జట్టుకు సులువు మహిళల జట్టుకు క్లిష్టం



**న్యూఢిల్లీ: ప్రతిష్టాత్మక థామస్ కప్, ఉబెర్ కప్ బ్యాడ్మింటన్ టోర్నమెంట్‌లో భారత పురుషుల, మహిళల జట్లకు భిన్నమైన 'డ్రా'లు ఎదురయ్యాయి. 2022లో తొలిసారి థామస్ కప్ చాంపియన్‌గా నిలిచిన భారత పురుషుల జట్టు ఈసారి స్థాయికి తగ్గట్టు ఆడితే క్వార్టర్ ఫైనల్ చేరుకోవడం ఖాయం. గ్రూప్ 'ఎ'లో డిఫెండింగ్ చాంపియన్ చైనా, కెనడా, ఆస్ట్రేలియా జట్లతో భారత్‌కు చోటు కల్పించారు. చైనాను మినహాయిస్తే కెనడా, ఆస్ట్రేలియా జట్లపై భారత్ విజయాన్ని ఊహించవచ్చు. రెండు విజయాలు సాధిస్తే భారత్ క్వార్టర్ ఫైనల్ చేరుకుంటుంది. మరోవైపు ఉబెర్ కప్‌లో భారత మహిళల జట్టుకు క్లిష్టమైన 'డ్రా' పడింది. గ్రూప్ 'ఎ'లో డిఫెండింగ్ చాంపియన్ చైనా, ఆతిథ్య దేశం డెన్మార్క్, ఉక్రెయిన్ జట్లతో భారత్ తలపడాల్సి ఉంటుంది. ఉక్రెయిన్‌పై టీమిండియా సులువుగా గెలవచ్చు. కానీ చైనా, డెన్మార్క్ జట్లపై భారత్ విజయావకాశాలు స్వల్పమే. ఈ నేపథ్యంలో భారత్ క్వార్టర్ ఫైనల్ చేరాలంటే చైనా లేదా డెన్మార్క్ జట్లలో ఒకదానిపై ఖచ్చితంగా నెగ్గాలి. భారత మహిళల జట్టు 2014, 2016లలో సెమీఫైనల్లో ఓడి కాంస్య పతకాలు సొంతం చేసుకుంది. రెండు విభాగాల్లో 16 జట్ల చొప్పన పాల్గొనే థామస్ కప్, ఉబెర్ కప్ టోర్నీ ఏప్రిల్ 24 నుంచి మే 3 వరకు డెన్మార్క్‌లోని హోర్సెన్స్ నగరంలో జరుగుతుంది. 2024 థామస్ కప్, ఉబెర్ కప్ టోర్నీలో భారత పురుషుల జట్టు క్వార్టర్ ఫైనల్లో చైనా చేతిలో... భారత మహిళల జట్టు క్వార్టర్ ఫైనల్లో జపాన్ చేతిలో ఓడిపోయాయి.**